
సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం
బుధవారం, 5, జూలై, 2023



మురుగు కాదు.. ఇక మెరుగు!
వ్యర్థాల నుంచి ఎరువుల తయారీకి ప్లాంట్లు ఏర్పాటు చేసిన అధికారులు ఇప్పుడు మురుగునీరు శుద్ధి ప్లాంట్లపై దృష్టి పెట్టారు. 8లో



పీవైఎల్ ర్యాలీ
పీవైఎల్ ఎనిమిదో రాష్ట్ర మహాసభల సందర్భంగా ఇల్లెందులో భారీ ర్యాలీ నిర్వహించారు. 8లో

గరిష్టం / కనిష్టం
30° / 24°

వాతావరణం
జిల్లాలో బుధవారం వాతావరణం చల్లగా ఉంటుంది. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

నేడు ఎస్ఆర్అండ్‌బీజీఎన్ఆర్ కళాశాలకు న్యాక్ బృందం

ఖమ్మం సహకారనగర్: ఖమ్మం జిల్లా కేంద్రంలోని ఎస్ఆర్ అండ్ బీజీఎన్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలను న్యాక్ బృందం బుధ, గురువారాల్లో సందర్శించనుంది. మహారాష్ట్రలోని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ మాజీ డైరెక్టర్ ప్రొఫెసర్ వసంత హెలవీరెడ్డి చైర్‌పర్సన్‌గా ఉన్న ఈ బృందంలో అస్సాం విశ్వవిద్యాలయం ఎకనామిక్స్ ప్రొఫెసర్ నిరంజన్‌రాయ్, తమిళనాడులోని హాజీకురాధ రౌదర్ హౌడియా కళాశాల మాజీ ప్రిన్సిపాల్ డాక్టర్ హౌద్ మొహిద్దీన్ సభ్యులుగా ఉంటారు. ఈమేరకు కళాశాలల్లో బోధన, వసతులు, పరిశోధనా అంశాలను పరిశీలించడమే కాక పూర్వ, ప్రస్తుత విద్యార్థులు, తల్లిదండ్రులతో ఈ బృందం సమావేశమవుతుంది. ఈ బృందం ఇచ్చే నివేదిక ఆధారంగా కళాశాలకు న్యాక్ గ్రేడ్‌ను ప్రకటిస్తారని ప్రిన్సిపాల్ మహ్మద్ జకీరుల్లా తెలిపారు.

మూడు రోజులపాటు మోస్తరు వర్షాలు

సూపర్‌బజార్(కొత్తగూడెం): మూడు రోజులపాటు జిల్లాలోని పలు ప్రాంతాలలో ఉరుములు, మెరుపులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని కొత్తగూడెం కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ వి.లక్ష్మీనారాయణమ్మ, వాతావరణ విభాగం శాస్త్రవేత్త వింధ్య, పర్యవేక్షకులు ఎం.సుమన్ మంగళవారం తెలిపారు. ఆగ్నేయ బంగాళాఖాతం, పరిసరాల్లో ఏర్పడిన ఆవర్తనం స్థిరంగా కొనసాగుతోందని పేర్కొన్నారు. ఈదురుగాలులు పశ్చిమ దిశ నుంచి తెలంగాణ రాష్ట్రం వైపు వీస్తున్నాయని, దీని ప్రభావంతో మూడురోజులు జిల్లాలో మోస్తరు వర్షాలు పడే అవకాశం ఉందని వివరించారు.

9న క్రీడాకారుల ఎంపిక

పాల్వంచరూరల్: ఈ నెల 9న జిల్లాస్థాయి బాల్ బ్యాడ్మింటన్ క్రీడాకారులను ఎంపిక చేస్తామని అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఇంటూరి రవికుమార్ తెలిపారు. మంగళవారం కేటీపీఎస్ కాలనీలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అండర్-11,13,15,17 విభాగాల్లో ఎంపికలు ఉంటాయని పేర్కొన్నారు. కేటీపీఎస్ థర్మల్ రిక్రియేషన్ క్లబ్ ఇండోర్ స్టేడియంలో క్రీడాకారుల ఎంపిక ప్రక్రియ జరుగుతుందని, ఆసక్తికలిగినవారు డబుల్స్, సింగిల్స్ విభాగాల్లో తమ పేర్లను 8వ తేదీలోగా నమోదు చేసుకోవాలని కోరారు. వివరాలకు 91773 23108, 80990 43377 నంబర్లలో సంప్రదించాలని కోరారు. శ్రీనివాసరావు, సావిత్రి, రమేష్, నారందాసు, వెంకటేశ్వర్లు, వరుణ్, శ్రీకాంత్, బాబు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

సూపర్‌బజార్(కొత్తగూడెం): పాలేరులోని జవహర్ నవోదయలో 6వ తరగతి ప్రవేశం కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కలెక్టర్ అనుదీప్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆగస్టు 10వ తేదీ వరకు గడువు ఉందని పేర్కొన్నారు. ప్రభుత్వ, ప్రభుత్వ గుర్తింపు పొందిన అన్ని యాజమాన్యాల పాఠశాలల్లో 5వ తరగతి చదువుతున్న విద్యార్థులే ఎంపిక పరీక్ష-2024కు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మండల విద్యాశాఖాధికారులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ఎక్కువ మంది ప్రవేశ పరీక్షకు హాజరయ్యేలా చూడాలని ఆదేశించారు. www. navodaya. gov. in వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

ఆర్టీసీ ఉద్యోగులకు అభినందన



ప్రశంసా పత్రం అందజేస్తున్న సజ్జనార్

భద్రాచలంటౌన్: భద్రాచలం ఆర్టీసీ డిపోలో పనిచేస్తున్న ఉద్యోగులకు రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ఎండీ వీసీ సజ్జనార్ అభినందన పత్రాలను అందజేశారు. హైదరాబాద్‌లోని ఆర్టీసీ భవన్‌లో మంగళవారం జరిగిన దసరా చాలెంజ్ పురస్కారాల కార్యక్రమంలో భద్రాచలం డిపోకు చెందిన డ్రైవర్లు ప్రకాశ్‌రావు, వెంకన్న, కండక్టర్ రవీందర్‌కు అభినందన పత్రాలతో పాటు అవార్డులను ప్రదానం చేశారు.

ట్యాంపరింగ్ చేయొద్దు

భద్రాచలంఅర్బన్: వాహనాల నంబర్లు కనిపించకుండా కొందరు రకరకాల పద్ధతులు పాటించడంతోపాటు నంబర్లను ట్యాంపరింగ్ చేస్తున్నారని, సంబంధిత వాహన యజమానులపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని భద్రాచలం ఏఎస్పీ పరితోష్ పంకజ్ అన్నారు. మంగళవారం పట్టణంలోని అంబేడ్కర్ సెంటర్‌లో విద్యార్థులకు, వాహనదారులకు ట్రాఫిక్‌పై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. కాగా స్పెషల్ డ్రైవ్‌లో నంబర్లు సరిగ్గా లేని 120 ద్విచక్రవాహనాలను గుర్తించి, స్టేషన్‌కు తరలించారు. ఎస్ఐలు మధు ప్రసాద్, పీవీఎన్ రావు, సిబ్బంది పాల్గొన్నారు.

ఇల్లెందు హనుమంతులపాడు పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు



ధారాళంగా చదివేలా..

ప్రభుత్వ పాఠశాలల్లో రీడింగ్ క్యాంపెయిన్
- గత నెల 23 నుంచి ఈనెల 31 వరకు అమలు
- అన్ని తరగతులకు రోజుకో పీరియడ్
- జిల్లాలోని 1,391 పాఠశాలల్లో అమలు

ఇల్లెందు: విద్యాశాఖ విభిన్న కార్యక్రమాలతో విద్యార్థుల సామర్థ్యాన్ని పెంపొందించేందుకు కృషి చేస్తోంది. ఇటీవల రాష్ట్ర ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా జరిగిన విద్యాదినోత్సవంలో పఠనోత్సవం(రీడింగ్ క్యాంపెయిన్)ను ప్రారంభించింది. గత నెల 23 నుంచి ఈ నెల 31 వరకు జిల్లా వ్యాప్తంగా 1,391 పాఠశాలల్లో అన్ని తరగతులకు రోజుకో పీరియడ్ పఠనోత్సవం నిర్వహిస్తున్నారు. ప్రతీ విద్యార్థి ధారాళంగా చదవటం, చదవటం అలవాటుగా మార్చుకోవటం, స్వతంత్ర పాఠకులుగా ఎదగడమే లక్ష్యంగా ఈ కార్యక్రమం రూపొందించినట్లు అధికారులు చెబుతున్నారు. పాఠ్యపుస్తకాలు, పాఠ్యేతర పుస్తకాలు, కథల పుస్తకాలు, వార్తా పత్రికలను చదివిస్తున్నారు. పూర్వ ప్రాథమిక విద్యార్థులు వర్ణమాల అక్షరాలను గుర్తించేలా, 1, 2 తరగతుల విద్యార్థులు సరళ పదాలను, గుణింతాలను, సంయుక్త పదాలను, వ్యాఖ్యాలను చదివేలా ప్రోత్సహిస్తున్నారు. 3వ నుంచి 10వ తరగతి వరకు విద్యార్థులతో పాఠ్యాంశాలను చదివిస్తున్నారు. ఈ అంశాన్ని బోధనలో కూడా అంతర్భాగం చేశారు. పాఠం చెప్పేముందు కొందరితో 10 నిమిషాలపాటు చదివిస్తున్నారు. ఈ క్రమంలో కీలకమైన పదాలను విద్యార్థులతో గుర్తింపజేయడంతోపాటు బ్లాక్ బోర్డు మీద రాసి వివరిస్తున్నారు.

గ్రంథాలయంలో మరో పీరియడ్..

గ్రంథాలయానికి రోజూ ఓ పీరియడ్ కేటాయించారు. మూడు రోజులపాటు మాతృభాష, రెండు రోజులపాటు ఆంగ్ల భాష, ఒకరోజు కథల పుస్తకాలను చదివిస్తున్నారు. హెచ్ఎంలు, ఉపాధ్యాయులు ఈ కార్యక్రమం అమలుపై ప్రత్యేక దృష్టి సారించారు. పాఠశాల గ్రంథాలయంలో విద్యార్థుల స్థాయికి తగిన పుస్తకాలను అందుబాటులో ఉంచారు. పిల్లలను ఆకర్షించేలా రంగు రంగుల కథల పుస్తకాలు సరఫరా చేశారు. ప్రతీ విద్యార్థి తనకు నచ్చిన పాఠం లేదా ఎంపిక చేసుకున్న కథల పుస్తకం అనర్గళంగా చదివేలా చర్యలు తీసుకుంటున్నారు. మేకపోతు గాంభీర్యం, ఒకరి ఒకరు, నమ్మలేని నిజాలు, నీళ్ల చెప్పిన నిజం, ఎవరు గొప్ప, చెడు స్నేహం, నిరాశ, మాటకు మాట.. లాంటి కథల పుస్తకాలు విద్యార్థులకు ఆసక్తి కలిగిస్తున్నాయి. జిల్లాలో 1,005 ప్రాథమిక పాఠశాలలు, 162 యూపీఎస్‌లు, 124 హైస్కూళ్లు ఉన్నాయి. వీటిలో పఠనోత్సవం కోసం 120 హైస్కూళ్లకు, 74 యూపీఎస్‌లకు, 270 ప్రాథమిక పాఠశాలలకు గ్రంథాలయ పుస్తకాలు అందజేశారు. పఠనోత్సవం అమలుపై ఉపాధ్యాయులకు శిక్షణ కూడా ఇచ్చారు.



ఇల్లెందులో పుస్తకాలతో విద్యార్థులు, ఉపాధ్యాయులు

ఎంతో ఉపయోగం



పఠనోత్సవం ఎంతో ఉపయోగం. చాలా మంది విద్యార్థులు వివిధ కారణాలతో సక్రమంగా బడికి రాని వారు ఉంటారు. వారికి చదవటం, రాయటం కూడా సక్రమంగా రాదు. వారిని సహా విద్యార్థులతో కలిపి చదివిస్తే క్రమంగా అలవాటు పడుతున్నారు.
–ఈ.రమేష్, హెచ్ఎం, హనుమంతులపాడు యూపీఎస్, ఇల్లెందు

సరదాగా చదువుతున్నారు



పాఠ్యపుస్తకంలో రోజూ చెప్పబోయే పాఠంతోపాటు గ్రంథాలయ పీరియడ్‌లో ప్రత్యేకంగా కథలు చదివిస్తుండటంతో సరదా పడుతున్నారు. చదివిన కథను అర్థం చేసుకుని ఆనందం వ్యక్తం చేస్తున్నారు. చదవటం ఒక అలవాటుగా చేసుకుంటున్నారు. పఠనోత్సవం వల్ల ఎంతో ఉపయోగం ఉంది.
–అశోక్, హెచ్ఎం, కళాసీబస్తీ యూపీఎస్, ఇల్లెందు

పర్యవేక్షిస్తున్నాం



రీడింగ్ క్యాంపెయిన్ పాఠశాలల్లో పటిష్టంగా అమలు చేసేలా పర్యవేక్షిస్తున్నాం. అన్ని పాఠశాలలకు పుస్తకాలు అందజేశాం. గ్రంథాలయాలను ఏర్పాటు చేశాం. మాతృభాష, ఇంగ్లిష్, కథల పుస్తకాలు చదివేలా ప్రణాళిక రూపొందించాం. విద్యార్థులు అనర్గళంగా చదివేలా కృషి చేస్తున్నాం.
–ఏ.నాగరాజశేఖర్, ఏఎంఓ, డీఈఓ కార్యాలయం

బాలల భవిష్యత్‌ను తీర్చిదిద్దాలి

కలెక్టర్ అనుదీప్



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్

సూపర్‌బజార్(కొత్తగూడెం): తప్పుదోవ పట్టిన బాలలను గుర్తించి, వారి భవిష్యత్‌ను తీర్చిదిద్దాలని కలెక్టర్ అనుదీప్ సూచించారు. ఐడీఓసీలో మంగళవారం మహిళా, శిశు, సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఆపరేషన్ ముష్కాన్, ఆపరేషన్ స్మైల్ కార్యక్రమాలపై నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. బాలలు పనిచేస్తున్న హాట్‌స్పాట్లను గుర్తించాలని, యజమానులపై పోలీస్ కేసులను నమోదు చేయాలని ఆదేశించారు. జిల్లాలో పోక్సో బాధితులు 389 మందికి రూ.1.54 ఆర్థికసాయం అందించినట్లు తెలిపారు. పెండింగ్‌లో ఉన్న 8 మంది బాధితుల సమస్యలను వారం రోజుల్లో పరిష్కరించాలనిచెప్పారు. చిరునామా లభించని బాధితుల సమాచారం పోలీస్‌శాఖ ద్వారా సేకరించాలని చెప్పారు. బాల్యవివాహాలు జరుగుతున్న మండలాలపై ప్రత్యేక ఫోకస్ పెట్టాలని అన్నారు. మిషన్ వాత్సల్యకు 372 దరఖాస్తులు వచ్చాయని, పెండింగ్ ఉన్న 365 దరఖాస్తుల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని చెప్పారు. అనంతరం వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. అధికారులు సబిత, మధుసూదన్‌రాజు, శిరీష, సంజీవరావు, షర్ఫుద్దీన్, హరికుమారి, బాలల సంరక్షణ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

అర్హులకు ఇళ్ల స్థలాలు..

సూపర్‌బజార్(కొత్తగూడెం): దారిద్ర్యరేఖకు దిగువనవున్న పేదలకు ఇళ్ల స్థలాలు పంపిణీ చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందని కలెక్టర్ అనుదీప్ తెలిపారు. మంగళవారం ఆయన వివరాలు వెల్లడించారు. కొత్తగూడెం మున్సిపాలిటీ, పాల్వంచ మండలం యానంబైలు, సుజాతనగర్ మండలం సీతంపేటలలో మాత్రమే ప్రభుత్వ భూమి అందుబాటులో భూమి ఉందని పేర్కొన్నారు. స్థానికులు, సొంత ఇళ్లు లేనివారు, గతంలో ఇళ్లస్థలాలు, డబుల్‌బెడ్ రూంలు పొందనివారు మాత్రమే అర్హులని తెలిపారు. దరఖాస్తుకు రేషన్‌కార్డు, ఓటరుకార్డు, ఆధార్‌కార్డు తప్పనిసరిగా జతపర్చాలని, కలెక్టరేట్‌లోని ఇన్‌వార్డులో ఈ నెల 5 నుంచి 12వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరిస్తామని వివరించారు. దరఖాస్తులపై ప్రత్యేక బృందాల ద్వారా విచారణ చేపట్టి, జాబితాను సంబంధిత మున్సిపాలిటీ లేదా గ్రామపంచాయతీకి అందజేసి అభ్యంతరాలు తీసుకుంటామని తెలిపారు. పూర్తి విచారణ అనంతరం అర్హుల జాబితాను సంబంధిత మున్సిపాలిటీ, గ్రామపంచాయితీ కార్యాలయం నోటీసుబోర్డుపై పెడతామని, అన్ని వర్గాల వారికి రిజర్వేషన్ల ప్రకారం ప్లాట్లను లాటరీ పద్ధతి ద్వారా కేటాయిస్తామని వివరించారు.

వచ్చే నెల 4న ఓటరు తుది జాబితా

సూపర్‌బజార్(కొత్తగూడెం): అక్టోబర్ 4న ఓటరు తుది జాబితా ప్రకటించనున్నట్లు కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి అనుదీప్ తెలిపారు. ఐడీఓసీలో మంగళవారం రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఓటరు జాబితా రూపకల్పనలో రాజకీయ పార్టీలు సహకరించాలని కోరారు. ఈ నెల 24వ తేదీ వరకు పోలింగ్ కేంద్రాల రేషనలైజేషన్ ప్రక్రియ పూర్తి చేయడంతోపాటు పోలింగ్ కేంద్రాలకు బౌండరీలు నిర్దేశిస్తామని తెలిపారు. అక్టోబర్ 1వ తేదీ నాటికి 18 సంవత్సరాలు నిండిన ప్రతీ ఒక్కరు ఓటరుగా నమోదు కావాలని చెప్పారు. శని, ఆదివారాల్లో అన్ని పోలింగ్ కేంద్రాల్లో ప్రత్యేక క్యాంపులు నిర్వహించి ఓటర్ల నుంచి అభ్యంతరాలను స్వీకరించాలని తెలిపారు. అభ్యంతరాలను సెప్టెంబర్ 22వ తేదీ నాటికి పరిష్కరించి, తుది ఓటరు జాబితాను అక్టోబర్ 4న ప్రకటిస్తామని వివరించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ కె.వెంకటేశ్వర్లు, ఎన్నికల విభాగం పర్యవేక్షకుడు సురేష్‌కుమార్, సిబ్బంది నవీన్, ఆనందరావు(బీఎస్పీ), లక్ష్మణ్ అగర్వాల్(బీజేపీ), ఎం.ధర్మారావు(కాంగ్రెస్), వై శ్రీనివాసరెడ్డి(సీపీఐ) తదితరులు పాల్గొన్నారు.

తీవ్రవాదంపై ఉక్కుపాదం..

- 77 మంది మావోయిస్టులను అరెస్ట్ చేశాం
- గోదావరి వరదల సమయంలో సమర్థంగా రెస్క్యూ ఆపరేషన్
- రూ.2 కోట్లతో పోలీస్ శాఖ తరఫున మొబైల్ క్లినిక్‌లు..
- ఏజెన్సీ పల్లెల అభివృద్ధి, సంక్షేమానికి కృషి
- ఎస్పీ డాక్టర్ వినీత్



ఎస్పీ డాక్టర్ జి. వినీత్

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: జిల్లా పోలీస్ బాస్‌గా డాక్టర్ జి.వినీత్ ఏడాది పదవీ కాలం పూర్తి చేసుకున్నారు. ఈ సమయంలో లా అండ్ ఆర్డర్‌ను అదుపులో ఉంచడంలో ఇప్పటికే తన మార్క్ చూపించారు. రాష్ట్రపతి, గవర్నర్, ముఖ్యమంత్రి వంటి వీవీఐపీల పర్యటనలు సాఫీగా జరిగిపోయేలా ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా గతేడాదిలో జరిగిన ముఖ్య సంఘటనలను ఆయన మీడియాతో పంచుకున్నారు. ఆ వివరాలు ఎస్పీ మాటల్లోనే..

రెస్క్యూ ఆపరేషన్ సక్సెస్..

పోలీసులుగా లా అండ్ ఆర్డర్ విషయంలో 24/7 అప్రమత్తంగా ఉంటాం. కానీ రెస్క్యూ ఆపరేషన్లు చేసే అవసరం తక్కువగా ఉంటుంది. అలాంటి సందర్భమే గతేడాది గోదావరికి రికార్డు స్థాయిలో వరదలు వచ్చినప్పుడు ఏర్పడింది. ముంపు ప్రాంత ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించడం కెరీర్‌లో మర్చిపోలేని ఘటన. అంత పెద్ద వరద వచ్చినా ప్రాణనష్టం లేకుండా మా వాళ్లు చాలా బాగా పని చేశారు. బూర్గంపాడులో ఒక్కరు చనిపోయారు. అది కూడా వరదల్లో చిక్కుకున్న వారిని అప్పటికే సురక్షిత ప్రాంతానికి తరలించాం. కానీ ఇంట్లో ముఖ్యమైన వస్తువు మర్చిపోయాను తెచ్చుకుంటానంటూ ఒకరు బోటులో బయల్దేరాడు. అతని వెంటే మరో పది మంది అదే బోటు ఎక్కారు. క్యాంపు ఉంచి కొంచెం ముందుకు వెళ్లగానే నీళ్లలో మునిగిన ఇంటి పైకప్పు తగిలి బోటు తిరగబడింది. అందులో వాళ్లంతా వరద నీటిలో పడిపోయారు. అదృష్టవశాత్తు నీళ్లలో పడినవారంతా వెంటనే అదే బోటు అంచులను పట్టుకుని ఉండిపోయారు. ఈ దృశ్యం క్యాంపులో ఉన్న వాళ్లకు కనిపించడంతో వెంటనే రెస్క్యూ టీమ్‌ను పంపి 10 మందిని రక్షించాం. ఒక్కరు మాత్రం నాకు ఈత బాగా వచ్చంటూ రెస్క్యూటీం వచ్చే వరకు ఎదురు చూడకుండా వరదలో ఎదురీతకు ప్రయత్నించి మరణించాడు. ఆ ఒక్క దుర్ఘటన తప్పితే 71 అడుగుల బీభత్స వరదలో రెస్క్యూ ఆపరేషన్ సక్సెస్‌ఫుల్‌గా చేశాం.

మావోయిస్టుల సంచారం లేదు..

జిల్లాకు తీవ్రవాద ప్రాబల్యం ఉన్న ఛత్తీస్‌గఢ్, ఒడిశాలతో సరిహద్దు ఉంది. మావోయిస్టు కార్యకలాపాలపై ఉక్కుపాదం మోపాం. జిల్లాలో ఎటువంటి అజ్ఞాత దళాలు సంచరించడం లేదు. ఆఖరికి లోకల్ ఆర్గనైజేడ్ స్క్వాడ్‌లు కూడా లేవు. ఏడాది కిందట ఇద్దరు ఉండేవారు. వీరిలో రజిత లొంగిపోగా రాజేశ్ అనే వ్యక్తి ఎన్‌కౌంటర్‌లో చనిపోయారు. వీరుకాకుండా ఇప్పటివరకు మావోయిస్టు దళాలతో సంబంధం ఉన్నవారిని 77 మందిని అరెస్టు చేశాం. పది మంది దళ సభ్యులు లొంగిపోయారు. ఉన్నతాధికారులు సహకారం ఇవ్వడంతోపాటు క్షేత్రస్థాయిలో సిబ్బంది కష్టించి పని చేయడంతో ఇది సాధ్యమైంది.

ఆదివాసీ గ్రామాల అభివృద్ధికి సహకారం..

ఏఎస్పీగా ఈ జిల్లాలో పోస్టింగ్ తీసుకుని ఇప్పుడు ఎస్పీగా ఉన్నాను. భద్రాచలం ఏజెన్సీలో ముఖ్యంగా వలస ఆదివాసీ గూడెల్లో విస్తృతంగా పర్యటించాను. వారి జీవితాలను దగ్గరగా చూశాను. ఇక్కడికి వచ్చిన తర్వాత ఓసారి హైదరాబాద్ వెళ్లినప్పుడు అక్కడ హైటెక్ సిటీ ప్రాంత ప్రజలను చూశాను. ఏజెన్సీ పల్లె ప్రజలకు హైదరాబాద్ ప్రజలకు కొన్ని తరాల అంతరం ఉందని బాధేసింది. అక్కడ అన్ని వసతులు ఉండగా ఇక్కడ పిల్లలకు కనీసం కట్టుకునే బట్టలు తినడానికి తిండి కూడా కష్టంగా ఉండే పరిస్థితులు నా మనసును కదిలించాయి. అందుకే ఆదివాసీ గ్రామాల అభివృద్ధికి మా వంతు సహకారం అందిస్తున్నాం. ఏజెన్సీ పల్లెల ప్రజల సంక్షేమం కోసం హెల్త్‌క్యాంపులు, పుస్తకాలు, మెడికల్ కిట్ల పంపిణీ, అవగాహన కార్యక్రమాలు క్రమం తప్పకుండా చేపడుతున్నాం.

మొబైల్ క్లినిక్‌లు ఏర్పాటు చేస్తున్నాం..

ఖాకీ యూనిఫాం ధరించకముందు నేనో డాక్టర్‌ను. ఆర్థిక లేమి కారణంగా అక్కడి ప్రజలు వైద్య సేవలు సరిగా వినియోగించుకోలేకపోతున్నారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి ప్రయోగాత్మకంగా ఏజెన్సీలో మొబైల్ క్లినిక్‌లు తీసుకురాబోతున్నాం. ఇందుకోసం మా శాఖ నుంచి రూ.2 కోట్లు మంజూరు చేయించాను. ఈ మొబైల్ క్లినిక్‌లో డాక్టర్లు, నర్సులు, ల్యాబులు తదితర ప్రాథమిక సౌకర్యాలు ఉంటాయి. అత్యవసర సమయాల్లో అంబులెన్సుగాను పని చేస్తుంది. త్వరలో మొబైల్ క్లినిక్ సేవలు చర్ల మండలంలోని పూసుగుప్ప, చెన్నాపురం గ్రామాల్లో అందుబాటులోకి వస్తాయి.

గంజాయి కట్టడి

నాలుగు రాష్ట్రాల సరిహద్దులో మన జిల్లాలోకి అక్రమంగా గంజాయి వస్తోంది. ప్రత్యేక చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు గంజాయిని పట్టుకుంటున్నాం. భారీ స్థాయిలో జిల్లా మీదుగా గంజాయి పోకుండా నిలువరించగలిగాం. కొందరు యువకులు బ్యాక్‌ప్యాక్‌లలో చిన్న మొత్తాల్లో గంజాయి తీసుకుపోతున్నట్లు గమనించాం. వాళ్లను పట్టుకుని కౌన్సెలింగ్ ఇచ్చి వదిలేస్తున్నాం. గంజాయి రాకుండా మరిన్ని చర్యలు తీసుకుంటాం.

ఆర్‌బీఐ ఆధ్వర్యంలో క్విజ్



రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థులతో బ్యాంకు అధికారులు, ఉపాధ్యాయులు

కొత్తగూడెంఅర్బన్: విద్యార్థులకు ఆర్థిక అక్షరాస్యత మీద అవగాహన పెంపొందించేందుకు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా స్థాయిలో క్విజ్ నిర్వహించారు. గత నెల 27న మండల స్థాయిలో నిర్వహించిన క్విజ్ పోటీలో ప్రథమ స్థానంలో నిలిచిన విద్యార్థులకు పాతకొత్తగూడెంలోని ఆనందఖని జెడ్పీఎస్ఎస్ పాఠశాలలో జిల్లా స్థాయి క్విజ్ జరిపారు. మణుగూరు జెడ్పీఎస్ఎస్ పాఠశాల విద్యార్థినులు దీక్షిత, అమూల్య ప్రథమ స్థానంలో నిలిచారు. ఈ నెల 10న హైదరాబాద్‌లో జరిగే రాష్ట్ర స్థాయి క్విజ్‌కు అర్హత సాధించారు. పూసుగూడెం జెడ్పీఎస్ఎస్ పాఠశాల విద్యార్థినులు పావని, ఉదయచంద్రిక ద్వితీయ స్థానంలో, మేదరబస్తీ ప్రభుత్వ పాఠశాల విద్యార్థినులు జోయాముస్కన్, కీర్తి ప్రియ తృతీయ స్థానంలో నిలిచారు. ఈ సందర్భంగా రిజర్వ్‌బ్యాంక్ అధికారి వైభవ్‌వ్యాస్, విద్యార్థులకు సర్టిఫికెట్లను పంపిణీ చేశారు. మండల స్థాయిలో అత్యంత ప్రతిభ కనబరిచి జిల్లా స్థాయి క్విజ్‌లో పాల్గొన్న విద్యార్థులను ఆయన అభినందించారు. అనంతరం లీడ్ బ్యాంక్ మేనేజర్ వి.రామిరెడ్డి, ఎస్బీఐ మేనేజర్ వి.రాజబాబు, పాఠశాల హెచ్ఎం రాణి, పాల్గొన్నారు.

లోటుపాట్లను గుర్తించిన 'ఎన్‌క్వాస్'!

- రెండో రోజూ భద్రాచలం ఏరియా ఆస్పత్రిలో బృందం తనిఖీ
- వివిధ విభాగాలను నిశితంగా పరిశీలిస్తున్న సభ్యులు



ఐసీయూలో వైద్య సేవలపై ఆరా తీస్తున్న డాక్టర్ పతాని

భద్రాచలంఅర్బన్: భద్రాచలం ఏరియా ఆస్పత్రిలో ఎన్‌క్వాస్ బృందం లోటుపాట్లను గుర్తించినట్లు తెలుస్తోంది. జాతీయ స్థాయిలో నాణ్యతా హామీ ప్రమాణాలను ధ్రువీకరించేందుకు నలుగురు సభ్యులతో కూడిన ఎన్‌క్వాస్(నేషనల్ క్వాలిటీ అస్యూరెన్స్ స్టాండర్స్ సర్టిఫికెట్) బృందం భద్రాచలం ప్రభుత్వాస్పత్రిలో మంగళవారం రెండో రోజు వివిధ విభాగాల్లో తనిఖీలు నిర్వహించింది. వైద్య సేవల్లో నాణ్యత, కేంద్రాల పరిశుభ్రత, టీకాల నిర్వహణ, ఆవరణంలో హరితహారం, పరిశుభ్రత, గర్భిణులకు ప్రత్యేక వసతులు తదితర అంశాలను పరిశీలిస్తున్నారు. బృందం సభ్యులు మూడు టీమ్‌లుగా విడిపోయి సోమ, మంగళవారాల్లో తనిఖీలు నిర్వహించారు. ఆస్పత్రి సిబ్బంది నిర్లక్ష్యం వల్ల అనేక లోటుపాట్లు ఉన్నట్లు ఎన్‌క్వాస్ బృందం గుర్తించినట్లు సమాచారం. బుధవారం కూడా తనిఖీలు కొనసాగనున్నాయి. ఈ తనిఖీల్లో ఢిల్లీకి చెందిన డాక్టర్ ఆర్‌కె. పతాని, భారతి (చెన్నై), గుణశీల (బెంగళూరు), ప్రతీక్ మోదీ (భోపాల్), ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రామకృష్ణ, ఆర్ఎంఓ డాక్టర్ రాజశేఖర్ రెడ్డి, ఐసీయూ ఇన్‌చార్జి డాక్టర్ కిషన్, సిబ్బంది పాల్గొన్నారు.

మూడేళ్లకోసారి తనిఖీలు..

మూడేళ్లకోసారి పర్యటించే ఎన్‌క్వాస్ బృందం 2018లో భద్రాచలం ఆస్పత్రి తొలిసారిగా తనిఖీలు నిర్వహించి, గుర్తింపు ఇచ్చింది. 2021లో కరోనా కారణంగా ఎన్‌క్వాస్ బృందం తనిఖీలు చేపట్టలేదు. తాజాగా ఈ ఏడాది తనిఖీలు చేపట్టారు. 200 పడకల సామర్థ్యం ఉన్న భద్రాచలం ఏరియా ఆస్పత్రికి ఎన్‌క్వాస్ గుర్తింపు లభిస్తే ప్రతి పడకకు రూ.10 వేల చొప్పున మూడేళ్లపాటు రూ.20 లక్షలు అందించనున్నారు.

క్షుణ్ణంగా పరిశీలిస్తున్నాం..

ఏరియా ఆస్పత్రిలో రోగులకు అందిస్తున్న అన్ని సదుపాయాలు, లోటుపాట్లను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నాం. మూడు రోజులపాటు నిర్వహించిన తనిఖీల పూర్తి నివేదికను వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేస్తాం. వీలైనంత త్వరగా ఎన్‌క్వాస్‌కు ఆస్పత్రి ఎంపికైందా? లేదా? అనే విషయం తెలుస్తుంది. మా దృష్టికి వచ్చిన లోటుపాట్లపై బృందం సభ్యులు అందరం చర్చించుకుంటాం. బుధవారం ఆస్పత్రి అధికారులతో సమావేశం నిర్వహించి , ఎక్కడెక్కడ ఏయే లోపాలు ఉన్నయో వివరిస్తాం.
–గుణశీల, ఎన్‌క్వాస్ బృందం సభ్యురాలు

క్లుప్తంగా

ప్రశాంత్‌కాలనీలో గుడిసెల తొలగింపు


సిబ్బంది కూల్చివేసిన గుడిసెలు

పాల్వంచ: పట్టణంలోని వెంగళరావుకాలనీ సర్వే నంబర్ 727లోని ప్రభుత్వ భూమిలో ఇటీవల కొందరు పేదలు వేసుకున్న గుడిసెలను రెవెన్యూ అధికారులు తొలగించారు. మంగళవారం తెల్లవారుజామున రేవంత్‌నగర్‌గా నామకరణం చేసుకున్న స్థలంలోని గుడిసెలను తహసీల్దార్ రంగా ప్రసాద్, ఆర్‌ఐలు రవి, హచ్చా ఆధ్వర్యంలో జేసీబీతో తొలగించే యత్నం చేశారు. కొన్ని షెడ్లుగా వేసుకున్న నిర్మాణాలను కూల్చి వేశారు. దీంతో అక్కడే నివాసం ఉంటున్న పేదలు వారిని అడ్డుకోగా అధికారులు అక్కడి నుంచి వెళ్లిపోయారు. ఈ సందర్భంగా రేవంత్ యువసేన జిల్లా కన్వీనర్ వానపాకుల రాంబాబు మాట్లాడుతూ పక్కనే ఉన్న స్థలాన్ని కొందరు ఆక్రమించి విక్రయించినా వాటి జోలికి పోని అధికారులు పేదలు వేసుకున్న గుడిసెలను తొలగించడం హేయమని తెలిపారు. కాగా, రెవెన్యూ అధికారుల విధులను అడ్డుకున్నాడని వానపాకుల రాంబాబుపై తహసీల్దార్ రంగా ప్రసాద్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. రాంబాబుపై ఎస్‌ఐ నరేశ్ కేసు నమోదు చేశారు.

'స్మార్ట్'గా ఫోన్ కొట్టేసిన నిందితుడు

భద్రాచలంఅర్బన్: భద్రాచలంలోని ఓ సెల్ షాప్ యజమానిని నమ్మించిన దుండుగుడు తనను వైద్యుడిగా పరిచయం చేసుకుని విలువైన సెల్‌ఫోన్ స్వాహా చేశాడు. వివరాలు.. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజ్ గ్రౌండ్ ఎదురుగా వున్న జేఎస్‌ఆర్ మొబైల్ షాప్‌నకు గుర్తు తెలియని వ్యక్తి మంగళవారం ఫోన్ చేశాడు. తనను అనస్తీషియన్ మణికంఠగా పరిచయం చేసుకుని బస్టాండ్ వెనకాల దేవరాజ్ హాస్పిటల్‌లో ఉన్నానని చెబుతూ సెల్‌ఫోన్ల వివరాలు ఆరా తీశారు. చివరకు రూ.40 వేల ఫోన్ ఎంచుకుని ఆస్పత్రికి ఫోన్, బిల్లు పంపిస్తే డబ్బులు చెల్లిస్తానని చెప్పాడు. దీంతో షాప్ యజమాని మరో యువకుడితో పంపించగా, ఆస్పత్రిలో మాస్క్ ధరించిన వ్యక్తి ఫోన్ తీసుకుని వెనుక గదిలో డబ్బులు ఉన్నాయని చెబుతూ వెళ్లి తిరిగి రాలేదు. దీంతో ఆరా తీయగా అనస్తీషియన్ ఎవరూ లేరని ఆస్పత్రి సిబ్బంది చెప్పగా, సీసీ కెమెరాల పుటేజీల్లో నమోదైన దృశ్యాల ఆధారంగా కూడా వివరాలు తెలియరాలేదు. దీంతో మోసపోయినట్లు తెలుసుకున్న షాపు యజమాని లబోదిబోమంటున్నాడు. అయితే, ఈ ఘటనపై పోలీస్‌స్టేషన్‌లో ఎలాంటి కేసు నమోదు కాలేదు.

నగల దుకాణంలో చోరీ


చర్ల: మండల కేంద్రంలోని ప్రధాన రహదారి పక్కన ఉన్న నగల దుకాణంలో చోరీ జరిగింది. సుమారు రూ.12 లక్షల విలువ చేసే బంగారు, వెండి వస్తువులను దొంగలు అపహరించారు. ఎస్‌ఐ పీవీఆర్ సూరి కథనం ప్రకారం.. చర్లలోని యూనియన్ బ్యాంకు ఎదురుగా ఉన్న శ్రీ హనుమాన్ జ్యుయలరీ షాపులోకి సోమవారం రాత్రి ప్రవేశించిన ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు ముందుగా సీసీ కెమెరాలను ధ్వంసం చేశారు. ఆ తరువాత కట్టర్లతో లాకర్‌ను కట్ చేసి అందులో ఉన్న సుమారు 200 గ్రాముల బంగారం, సుమారు కిలో వెండి వస్తువులను చోరీ చేశారు. ఈ విషయాన్ని షాపు యజమాని లక్ష్మణాచారి మంగళవారం ఉదయం గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో సీఐ బి.అశోక్, ఎస్‌ఐలు పీవీఆర్ సూరి, వెంకటప్పయ్య ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు ఆరా తీశారు. కొత్తగూడెం నుంచి క్లూస్‌టీం వచ్చి ఆధారాలను సేకరించడంతో పాటు వేలిముద్రలను సేకరించారు.

బాలికపై కుక్క దాడి


గాయపడిన బాలిక

అశ్వారావుపేటరూరల్: బాలికపై కుక్క దాడి చేసిన ఘటన మంగళవారం వెలుగులోకి వచ్చింది. వివరాలిలా.. మండలంలోని వినాయకపురంకాలనీకి చెందిన పదేళ్ల బాలిక పురేటి లాలస సోమవారం సాయంత్రం తన స్నేహితురాలి ఇంటికి వెళ్లి తిరిగి వస్తున్న క్రమంలో మార్గమధ్యలో కుక్క దాడి చేసి తీవ్రంగా గాయపరిచింది. గమనించిన చుట్టుపక్కలవారు కుక్క బారినుంచి బాలికను రక్షించి, కుటుంబీకులకు సమాచారం ఇచ్చారు. బాలిక తండ్రి చిలకారావు బాలికను అశ్వారావుపేటలోని ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకొచ్చారు. ఈ ఆస్పత్రిలో కుక్క కాటు వ్యాక్సిన్ చేసి, మరో ఇంజక్షన్ తమ వద్ద లేదని కొత్తగూడెం ప్రభుత్వ ఆస్పత్రికి పంపించారని, స్థానిక సిబ్బంది కనీసం పట్టించుకోకుండా కుక్క కరిచిన గాయాన్ని తనతోనే శుభ్రం చేయించినట్లు బాధితురాలి తండ్రి వాపోయాడు. దీనిపై ఆస్పత్రి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పూర్ణచంద్‌ను 'సాక్షి' వివరణ కోరగా.. ఆస్పత్రిలో 'ఇమ్యునోగ్లోబిలిన్' అనే ఇంజక్షన్ అందుబాటులో లేకపోవడంతో కొత్తగూడెం ఆస్పత్రికి రిఫర్ చేసినట్లు చెప్పారు. కాగా, ఆస్పత్రి సిబ్బంది నిర్లక్ష్యంపై విచారణ చేసి తగిన చర్యలు తీసుకుంటామని, మరోసారి ఇలాంటివి జరగకుండా చూస్తానని చెప్పారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.12,623

మురుగు కాదు.. ఇక మెరుగు!

మున్సిపాలిటీల్లో మురుగు నీటి శుద్ధి ప్లాంట్లు

- ఉమ్మడి జిల్లాకు 19 ప్లాంట్లు మంజూరు
- భద్రాద్రి జిల్లాలో 13, ఖమ్మం జిల్లాలో ఆరు ప్లాంట్లు
- భూమి కేటాయించాలని తహసీల్దార్లకు లేఖలు


మురుగునీటిని శుద్ధి చేసే ప్లాంట్ (ఫైల్)

ఇల్లెందు: నిన్నటి వరకు తడి, పొడి వ్యర్థాల నుంచి ఎరువుల తయారీకి ప్లాంట్లు ఏర్పాటు చేసిన అధికారులు ఇప్పుడు మురుగునీరు శుద్ధి ప్లాంట్లపై దృష్టి సారించారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాకు 19 మురుగు నీటి శుద్ధి ప్లాంట్లు మంజూరయ్యాయి. ఆయా ప్లాంట్ల ఏర్పాటుకు అనువైన ప్రదేశాలను గుర్తించి అప్పగించాలని కలెక్టర్లు స్థానిక మున్సిపాలిటీల అధికారులకు సూచించారు. ఇప్పటికే ఆయా పట్టణాల్లో మురుగు నీరు అత్యధికంగా ప్రవహించే లోతట్టు ప్రాంతాలను శాటిలైట్ చిత్రాల సాయంతో గుర్తించారు. ఆయా ప్రాంతాల్లో మురుగునీటి ప్రవాహం ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో ప్లాంట్ ఏర్పాటుకు నిర్ణయించారు.

ప్రతీ ఇంటి నుంచి మురుగునీరు

ప్రతీ ఇంట్లోని సెప్టిక్ ట్యాంక్‌తో పాటు స్నానపు గదులు, దుస్తులు శుభ్రం తదితర అంశాల ఆధారంగా నీరు బయటకు వస్తుంటుంది. అయితే, చాలా ఇళ్లల్లో ఇంకుడు గుంతలు లేవు. దీంతో నీరంతా వృథాగా కాల్వల ద్వారా జలాశయాల్లోకి చేరుతుంది. ఈ కారణంగా జలాశయాల్లోని నీరు కలుషితమై అటు జీవరాశులకు ముప్పు వాటిల్లడమే కాక తాగు నీటి అవసరాలకు ఉపయోగిస్తే అనర్థాలు ఎదురవుతున్నాయి. దీంతో ఈ నీటిని ప్రత్యేక కేంద్రాలకు తరలించి శుద్ధి చేయడం ద్వారా జలాశయాలకు ముప్పు తొలగిపోనుండగా.. ఇతర అవసరాలకు ఉపయోగించుకోవచ్చనే నిర్ణయానికి వచ్చారు.

ఎలా పని చేస్తుందంటే..

పట్టణాల నుంచి విడుదలయ్యే మురుగు నీరంతా శుద్ధి కేంద్రాలకు చేరేలా ప్రత్యేక ఏర్పాట్లు చేస్తారు. కేంద్రాల్లో నీటిని శుద్ధి చేశాక ఇతర అవసరాలకు వినియోగించడం ద్వారా వృథా కాకుండా కట్టడి చేసినట్లవుతుంది. ఈ నీటిని మొక్కల పెంపకం, పంటల సాగు తదితర అవసరాలకు వినియోగిస్తామని చెబుతున్నారు. అంతేకాకుండా నీటిని శుద్ధి చేశాక మిగిలే వ్యర్థాలతో ఎరువు తయారుచేసి మొక్కల పెంపకం, పంటల సాగుకు అందజేస్తారు.

త్వరలోనే పనుల ప్రారంభం



ఇల్లెందు మున్సిపాలిటీకి రెండు మురుగు నీటి శుద్ధి కేంద్రాలు మంజూరయ్యాయి. భూమి కేటాయింపు ప్రక్రియ పూర్తి కాగానే టెండర్లు ఆహ్వానిస్తాం. ప్లాంట్లుఅందుబాటులోకి రాగానే మురుగునీటి సమస్య పరిష్కారమవుతుంది. ఈ మేరకు పనులు త్వరగా ప్రారంభమయ్యేలా పర్యవేక్షిస్తున్నాం.

–అంకుషావలి, కమిషనర్, ఇల్లెందు మున్సిపాలిటీ

ఉమ్మడి జిల్లాకు మంజూరైన కేంద్రాల వివరాలు

మున్సిపాలిటీ	నిర్మాణ ప్రాంతం	ప్లాంట్ సామర్థ్యం (ఎంఎల్‌డీ)	స్థల కేటాయింపు (ఎకరాల్లో)
కొత్తగూడెం	రామవరం	9.00	4.02
	విద్యానగర్	3.50	1.30
	భువన గార్డెన్స్	3.50	1.30
	ముర్రేడు వాగు	1.00	0.25
మణుగూరు	టెక్నో స్కూల్	5.00	2.19
	శివలింగాపూర్	1.50	0.36
పాల్వంచ	గుడెపాడు	10.00	4.00
	మంచికంటినగర్	2.50	1.10
	కేసీఆర్‌నగర్	1.00	0.25
	వెంగళరావునగర్	3.50	1.30

మున్సిపాలిటీ	నిర్మాణ ప్రాంతం	ప్లాంట్ సామర్థ్యం (ఎంఎల్‌డీ)	స్థల కేటాయింపు (ఎకరాల్లో)
ఇల్లెందు	రైల్వేస్టేషన్	6.00	2.23
	సుదిమళ్ల గురుకులం	1.00	0.25
మధిర	జీకే పౌల్ట్రీ	6.00	2.28
	మడుపల్లి హైస్కూల్	1.00	0.25
సత్తుపల్లి	రాజీవ్‌కాలనీ	3.00	1.20
	వేశ్యాకాంతుల చెరువు	2.00	1.20
	తామరచెరువు	1.00	0.25
	వెంగళరావునగర్	1.00	0.25
వైరా	మార్కెట్ యార్డు	6.50	2.37

సుభాష్‌నగర్ రహదారి ఆధునికీకరణ

- రూ.10 కోట్లు మంజూరు చేసిన ప్రభుత్వం
- పరిశీలించిన ఎమ్మెల్యే హరిప్రియ, ఆర్అండ్‌బీ సీఈ మోహన్‌నాయక్


రహదారిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే హరిప్రియ, ఆర్అండ్‌బీ సీఈ మోహన్‌నాయక్, ఎస్ఈ లక్ష్మణ్

ఇల్లెందురూరల్: మండలంలోని అతిపెద్ద గ్రామపంచాయతీ అయిన సుభాష్‌నగర్ ప్రధాన రహదారిని ఆధునికీకరించేందుకు నిర్ణయించిన ప్రభుత్వం అందుకు అనుగుణంగా ఎస్టీ ఎస్‌డీఎఫ్ నిధుల నుంచి రూ.పది కోట్లు మంజూరు చేసింది. ఇప్పటికే సుభాష్‌నగర్ కూడలి నుంచి గ్రామపంచాయతీ శివారు వరకు డివైడర్ నిర్మించగా తాజాగా మరోవైపుగా ఖమ్మం మార్గంలో గ్రామపంచాయతీ శివారు వరకు డివైడర్‌తోపాటు సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయనున్నారు. కాగా, మంగళవారం స్థానిక ఎమ్మెల్యే బానోత్ హరిప్రియ, ఆర్అండ్‌బీ సీఈ మోహన్‌నాయక్, ఎస్ఈ లక్ష్మణ్, ఈఈ భీమ్లా, డీఈ వెంకటేశ్వరరావు తదితరులు సుభాష్‌నగర్ ప్రధాన రహదారులను స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బానోత్ హరిప్రియ, ఆర్అండ్‌బీ సీఈ మోహన్‌నాయక్ మాట్లాడుతూ.. సుభాష్‌నగర్ కూడలి నుంచి లలితాపురం గ్రామం వరకు 1.5 కిలోమీటర్ల దూరం డివైడర్, సెంట్రల్ లైటింగ్ నిర్మాణం కోసం ప్రభుత్వం రూ.10 కోట్లు మంజూరు చేసిందన్నారు. రహదారి మధ్యభాగం నుంచి ఒక వైపునకు 50 మీటర్లు వెడల్పు ఉండేలా జాగ్రత్తలు తీసుకుంటామని చెప్పారు. దీంతోపాటు కూడలి నుంచి మరోవైపుగా ఇప్పటికే నిర్మించిన డివైడర్‌కు సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. కార్యక్రమంలో సుభాష్‌నగర్ సర్పంచ్ వల్లాల మంగమ్మ, ఎంపీటీసీ సభ్యురాలు శీలం ఉమ, వార్డు సభ్యులు ఆళ్ల నాగేశ్వరరావు, గుమ్మడి అపర్ణ, కొలిపాక కవిత, బీఆర్‌ఎస్ నాయకులు శీలం రమేశ్, ఖమ్మంపాటి రేణుక, యలమద్ది రవి, కొలిపాక శ్రీనివాస్, వల్లాల నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

ఇల్లెందులో పీవైఎల్ ఆధ్వర్యంలో ర్యాలీ

రాష్ట్ర మహాసభలు ప్రారంభం


సభలో మాట్లాడుతున్న ఆవునూరి మధు


ర్యాలీ నిర్వహిస్తున్న పీవైఎల్ బాధ్యులు

ఇల్లెందు: ప్రగతిశీల యువజన సంఘం (పీవైఎల్) ఎనిమిదో రాష్ట్ర మహాసభల సందర్భంగా పట్టణంలో సంఘం ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. గోవింద్‌సెంటర్ నుంచి ప్రభుత్వ వైద్యశాల వరకు సాగిన ఈ ర్యాలీలో కోలాట బృందాలు, కళాకారుల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా నిర్వహించిన బహిరంగ సభలో సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు డి.సాయిరెడ్డి, ఇందూరి సాగర్, రాష్ట్ర నాయకుడు ఆవునూరి మధు, అరుణోదయ రాష్ట్ర అధ్యక్షులు పరకాల నాగన్న పాల్గొని ప్రసంగించారు. దేశంలో మోదీ, రాష్ట్రంలో కేసీఆర్ ప్రభుత్వాలు ఫాసిస్టు విధానాలు అవలంబిస్తున్నాయని తెలిపారు. నిరంకుశం, నియతృత్వం, పాశవిక పాలన సాగుతోందన్నారు. కార్పొరేట్ శక్తులకు దేశాన్ని కారుచౌకగా తాకట్టు పెడుతున్నారని, ప్రజలపై భారం మోపుతున్న మోదీ, కేసీఆర్‌ల పాలనపై యువత నడుంబిగించాల్సిన తరుణం ఆసన్నమైందని తెలిపారు. సింగరేణిని కూడా తాకట్టు పెట్టేందుకు ప్రయత్నిస్తోందని ఆరోపించారు. కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణలో నిరుద్యోగులకు ఆత్మహత్యలే శరణ్యమయ్యాయని, నోటిఫికేషన్ల పేరుతో కాలయాపన చేస్తున్నారని విమర్శించారు. ఇంటికో ఉద్యోగం, నిరుద్యోగ భృతి హామీలకే పరిమితమైందని, ప్రజా ఉద్యమకారులపై నల్లచట్టాలు ప్రయోగిస్తున్నారని మండిపడ్డారు. మతం, కులం, మత్తులో మునిగిపోతున్న యువతరానికి పీవైఎల్ సామాజిక అవగాహన కల్పిస్తోందని, అశ్లీల, బూతు సాహిత్యానికి, మత్తు పానీయాలకు వ్యతిరేకంగా పీవైఎల్ యువకులను చైతన్యపరుస్తోందని వెల్లడించారు. సభలో పీవైఎల్ ఉపాధ్యక్షులు కోలా లక్ష్మీనారాయణ, ఎన్డీ మహబూబాబాద్ జిల్లా కార్యదర్శి బండారు ఐలయ్య, పీఓడబ్ల్యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మంగ, ఎన్డీ డివిజన్ కార్యదర్శి తుపాకుల నాగేశ్వరరావు, పీవైఎల్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు చింతా నర్సింహావు, పర్శిక రవి, పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.మహేశ్, దాసు, కునుకుంట్ల సైదులు తదితరులు పాల్గొన్నారు.

వరి విత్తనాల బస్తాలు స్వాధీనం

ములకలపల్లి: మండలంలోని నర్సాపురం గ్రామంలో ఓ ఇంట్లో నిల్వ ఉంచిన వరి విత్తనాల (వడ్లు) బస్తాలను వ్యవసాయాధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఏఓ కరుణామయి కథనం మేరకు.. నర్సాపురంలో ఓ ఇంట్లో వరి విత్తనాల బస్తాలు ఉన్నట్లు విశ్వసనీయ సమాచారం అందింది. ఈ మేరకు దాడులు నిర్వహించగా ఆ ఇంట్లో 40 బస్తాలు ఉన్నట్లు గుర్తించారు. ఐతే గ్రామానికి చెందిన ఇద్దరు రైతులు ఆంధ్రా నుంచి కొనుగోలు చేసినట్లు అధికారులకు బిల్లులు చూపారు. ఐతే ఒకే ప్రదేశంలో బస్తాలు నిల్వ ఉంచడంతో బిల్లులు స్వాధీనం చేసుకొని, బస్తాలు ఉంచిన గదిని సీజ్ చేశారు. ఏడీఏ అఫ్జల్‌బేగం, క్వాలిటీ కంట్రోల్ ఏడీ లాల్‌చంద్‌కు ఏఓ ఫిర్యాదు చేశారు. ఉన్నతాధికారుల విచారణ అనంతరం చర్యలు తీసుకోనున్నట్లు వివరించారు. విచారణలో రైతుల వడ్లుగా తేలితే వారికే ఇస్తామని ఏఓ స్పష్టం చేశారు.

ఈ సారు మాకొద్దు..

రాయిగూడెం ఉపాధ్యాయుడిపై గ్రామస్తుల ఫిర్యాదు


ఎంఈఓకు ఫిర్యాదు చేస్తున్న రాయిగూడెం గ్రామస్తులు

గుండాల: బడికి సక్రమంగా రాడని, విద్యార్థులను పట్టించుకోడని, చదువు చెప్పడని ఆళ్లపల్లి మండలంలోని రాయిగూడెం ఉపాధ్యాయుడిపై గ్రామస్తులు ఎంఈఓ కృష్ణయ్యకు ఫిర్యాదు చేశారు. మంగళవారం ఆ పాఠశాలను సందర్శించిన ఎంఈఓ కృష్ణయ్యకు ఉపాధ్యాయుడు రామకృష్ణపై గ్రామస్తులు లిఖిత పూర్వకంగా మా బడికి ఈ సారు వద్దు అని రాసిచ్చారు. గతంలో కాంప్లెక్స్ హెచ్ఎం ద్వారా షోకాజ్ నోటీసులు ఇచ్చినా పద్ధతి మార్చుకోవడం లేదని, మధ్యాహ్న భోజన బియ్యం కూడా వాడుకున్నాడని ఆరోపించారు. నిధులను కూడా చైర్మన్‌కు తెలియకుండా వాడుతున్నాడని, పిల్లలకు కనీస పరిజ్ఞానం లేదని పేర్కొన్నారు. ఎంఈఓ స్పందిస్తూ డీఈఓకు నివేదిక పంపిస్తానని, ఈ ఉపాధ్యాయుడిని తాత్కాలికంగా ఆళ్లపల్లికి పంపించి, ఇక్కడ మరో ఉపాధ్యాయుడిని నియమిస్తామని తెలిపారు.

హాస్టల్‌లో నీటి పరఫరాకు చర్యలు

సాక్షి ఎఫెక్ట్..


పాల్వంచ: పాల్వంచలోని సాంఘిక సంక్షేమ బాలికల పాఠశాల, కళాశాల హాస్టల్‌లో నీళ్లు రాక విద్యార్థినులు అవస్థలు పడుతుండటంతో అధికారులు చర్యలు తీసుకున్నారు. నీటి సమస్యతో విద్యార్థులు ఇబ్బంది పడుతుండటంతో మంగళవారం 'సాక్షి'లో 'బాలికల హాస్టల్‌లో కన్నీటి రోదన' కథనం ప్రచురితమైంది. దీంతో ప్రిన్సిపాల్ శాంతికుమారి స్పందించారు. మోటార్ వైరింగ్ కాలిపోవడంతో వెంటనే మరమ్మతు చేయించారు. నీళ్లు రెండో ఫ్లోర్‌కు వెళ్లక పోవడంతో విద్యార్థులు కిందికి వచ్చి వాడుకునేలా చర్యలు తీసుకున్నారు. ముక్కిపోయిన బియ్యంను బుధవారం సివిల్ సప్లయ్ అధికారులు రీప్లేస్‌మెంట్‌కు తీసుకెళ్లనున్నట్లు తెలిపారు.

ఆరుగురు బలవన్మరణం


మన్మధరావు (ఫైల్)


చండ్రుగొండ: వేర్వేరు కారణాలతో మండలంలో మంగళవారం ముగ్గురు బలవన్మరణానికి పాల్పడ్డారు. మరొకరు ఆత్మహత్యాయత్నం చేశారు. పోలీసులు, గ్రామస్తులు, కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. మండలంలోని సత్యనారాయణపురం గ్రామానికి చెందిన కుంజా మన్మధరావు (18) ఇంటిపక్కనే ఉన్న ప్రాథమిక పాఠశాల ప్రాంగణంలోని చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. 5వ, తరగతి వరకు చదువుకున్న మన్మధరావు అదే పాఠశాలలో ఆత్మహత్య చేసుకోవడం గమనార్హం. తండ్రి పోతురాజు ఆరు నెలల కిందట అనారోగ్యంతో మరణించాడు. తల్లి భద్రమ్మకు వ్యవసాయ పనుల్లో చేదోడు వాదోడుగా ఉంటున్న మన్మధరావు మృతి అనుమానాస్పదమని గ్రామస్తులు అంటున్నారు. తల్లి భద్రమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ గొల్లపల్లి విజయలక్ష్మి తెలిపారు.

పురుగులమందు తాగి వ్యాపారి..


కృష్ణప్రసాద్ (ఫైల్)

మండలంలోని తుంగారం గ్రామంలో వ్యాపారి నల్లగోపు కృష్ణప్రసాద్ (28) పురుగులమందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అతడికి భార్య కవిత, ఏడాది పాప ఉన్నారు. కృష్ణప్రసాద్ సిమెంట్, ఐరన్ వ్యాపారం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. మండలంలోని సింగభూపాలం చెరువు వద్దకు వెళ్లి సోమవారం పురుగులమందు తాగాడు. గమనించిన అక్కడి వారు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్స నిమిత్తం ఖమ్మం తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం మరణించాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సుజాతనగర్ ఎస్ఐ తిరుపతిరావు తెలిపారు.

రేపల్లెవాడలో వివాహిత..


భారతి (ఫైల్)


మండలంలోని రేపల్లెవాడలో వివాహిత గందారపు భారతి (30) సోమవారం ఇంట్లోనే ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఆమెకు భర్త నరేశ్, పిల్లలు సాయి, రమ్యశ్రీ ఉన్నారు. పిల్లలు పాఠశాలకు వెళ్లగా భర్త నరేశ్ వంటగ్యాస్ తెచ్చేందుకు వెళ్లాడు. నరేశ్ వచ్చేలోపే భారతి ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. తమ మధ్య ఎలాంటి గొడవలు లేవని అత్తమామలతోపాటు భర్త చెబుతున్నారు. కృష్ణా జిల్లా తిరువూరు సమీపంలోని ముష్టికుంట గ్రామానికి చెందిన భారతికి నరేశ్‌తో 14 ఏళ్ల కిందట వివాహం జరిగింది. కాగా, అత్తమామలతోపాటు భర్త, ఆడపడుచు వేధింపుల కారణంగానే తన సోదరి ఆత్మహత్య చేసుకుందని జూలూరుపాడు మండలం పడమట నర్సాపురానికి చెందిన శిరికొండ త్రివేణి ఆరోపిస్తోంది. తాను ఆత్మహత్య చేసుకునే కొన్ని నిమిషాల ముందు ఫోన్‌లో మాట్లాడుతూ ఇక వేధింపులు భరించలేనని చెప్పిందని త్రివేణి చెప్పింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ గొల్లపల్లి విజయలక్ష్మి తెలిపారు.

ఉరి వేసుకుని వివాహిత...


లత (ఫైల్)


అశ్వారావుపేటరూరల్: ఉరి వేసుకొని ఓ వివాహిత ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మంగళవారం చోటు చేసుకుంది. స్థానికులు, బంధువుల కథనం ప్రకారం.. మండల కేంద్రంలోని వెలమ బజార్‌కు చెంది న గజవెల్లి లత (36)కు, భర్త శేష గిరికి మధ్య సోమవారం రాత్రి గ్యాస్ బండ విషయంలో వాగ్వాదం జరిగింది. దీంతో మనస్తాపానికి గురైన లత మంగళవారం ఉదయం ఇంట్లోనే ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. ఏపీలోని ఎన్టీఆర్ జిల్లా సత్యాలపాడుకు చెందిన లతకు, శేషగిరితో సుమారు 13ఏళ్ల కిందట వివాహం కాగా, దంపతులకు ఇద్దరు సంతానం. అయితే, వివాహిత ఆత్మహత్యపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. సమాచారం అందుకున్న పోలీసులు మృతదేహాన్ని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై ఇంకా లిఖిత పూర్వకంగా ఫిర్యాదు రాలేదని ఎస్ఐ బి.రాజేశ్ కుమార్ తెలిపారు.

మనస్తాపంతో వ్యక్తి...


శ్రీను (ఫైల్)

పాల్వంచ: కుటుంబ కలహాల నేపథ్యంలో ఓ వ్యక్తి ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసుల కథనం మేరకు.. పట్టణంలోని వికలాంగులకాలనీకి చెందిన ఎడెల్లి శ్రీను (36) మంగళవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అతడికి భార్య లావణ్య ఉండగా మరో యువతిని వివాహం చేసుకున్నాడు. దీంతో మొదటి భార్యకు, శ్రీనుకు మధ్య వివాదం జరుగుతోంది. ఈ క్రమంలోనే ఆత్మహత్యకు పాల్పడినట్లు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. లావణ్య ఫిర్యాదు మేరకు ఎస్ఐ ప్రవీణ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి ఇద్దరు కుమారులున్నారు.

టేకులపల్లిలో..


ముత్తేశ్వర్‌రావు (ఫైల్)

టేకులపల్లి: ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలో మంగళవారం చోటు చేసుకుంది. టేకులపల్లి ఎస్ఐ రమణారెడ్డి కథనం ప్రకారం.. మండలంలోని కోయగూడెం గ్రామానికి చెందిన జానపాటి ముత్తేశ్వర్‌రావు (42) వ్యవసాయం, కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. వ్యవసాయంలో ఆశించిన మేర దిగుబడి రాకపోవడంతో అప్పులయ్యాయి. తీవ్ర మనస్తాపానికి గురై మంగళవారం తెల్లవారుజామున ఇంటి వెనకాల రేకుల షెడ్డులో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. భార్య నాగమణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు. మృతుడికి ఇద్దరు పిల్లలున్నారు. దంపతులిద్దరి మధ్య తరచూ తగాదాలు జరుగుతున్నాయని, మద్యం మత్తులో ఆత్మహత్య చేసుకున్నాడని చర్చ జరుగుతోంది.

గోదావరిలో మునిగి యువకుడు గల్లంతు


సాగర్ (ఫైల్)

దుమ్ముగూడెం: మండలంలోని సీతారాంపురం గ్రామంలో ఉన్న గోదావరిలో మునిగి రామారావుపేట గ్రామానికి చెందిన కంగాల సాగర్ గల్లంతైన ఘటన మంగళవారం చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి.. సాగర్ మరో ఐదుగురు స్నేహితులతో కలిసి సరదాగా గోదావరిలో ఈత కొట్టేందుకు వెళ్లాడు. గోదావరి లోతు అంచనా వేయలేక మునిగిపోయాడు. స్నేహితులు గాలించినా దొరక్కపోవడంతో డయల్‌-100కు, గ్రామస్తులకు సమాచారం ఇచ్చారు. ఎస్ఐ నర్సిరెడ్డి ఘటనా స్థలానికి చేరుకుని గాలింపు చర్యలు చేపట్టారు. సాగర్ ఇటీవలే డిగ్రీ పూర్తి చేశాడు.

శ్రీరాంపురంలో వివాహిత ఆత్మహత్యాయత్నం

మండలంలోని శ్రీరాంపురంలో మంగళవారం ఓ వివాహిత ఎలుకలమందు తాగి ఆత్మహత్యాయత్నం చేసినట్లు విశ్వసనీయ సమాచారం. కుటుంబ కలహాల నేపథ్యంలో ఈ ఘటన చోటుచేసుకున్నట్లు తెలిసింది. కొత్తగూడెంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఆమె ఆరోగ్య పరిస్థితి నిలకడగానే ఉన్నట్లు తెలిసింది. ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

గంజాయి విక్రయించేందుకు వచ్చిన వ్యక్తులు

స్థానికులు అడ్డుకోవడంతో పరార్

పాల్వంచ: గంజాయి విక్రయించేందుకు ఇద్దరు వ్యక్తులు రాగా స్థానికులు గుర్తించి పట్టుకునేందుకు ప్రయత్నించగా పరారయ్యారు. స్థానికుల కథనం ప్రకారం.. మంగళవారం పట్టణంలోని తెలంగాణనగర్ సమీపంలో కొత్తగా నిర్మించిన శ్మశాన వాటిక దగ్గర ఇద్దరు వ్యక్తులు గంజాయి తీసుకొచ్చి అనుమానాస్పదంగా తిరుగుతున్నారు. గమనించిన స్థానికులు వారిని పట్టుకునేందుకు ప్రయత్నించగా రెండు గంజాయి ప్యాకెట్లు, విడి గంజాయి ఉన్న బ్యాగులను అక్కడే పడేసి పరారయ్యారు. పోలీసులు అక్కడికి చేరుకుని 6 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఐ నరేశ్‌ను వివరణ కోరగా గంజాయిని స్వాధీనం చేసుకున్నామని, విక్రయించేందుకు వచ్చినవారు పరారీలో ఉన్నారని, కేసు నమోదు చేశామని తెలిపారు.

సైబర్ కేసు నమోదు

బూర్గంపాడు: మండలంలోని మోరంపల్లిబంజర గ్రామానికి చెందిన రోశిరెడ్డి ఫిర్యాదు మేరకు మంగళవారం పోలీసులు సైబర్ కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. రోశిరెడ్డికి గత నెల 11వ తేదీన అపరిచిత వ్యక్తి ఫోన్ చేసి మనీ యాప్ డౌన్‌లోడ్ చేసుకోమని సూచించాడు. తరువాత అతని ఫోన్‌కు వచ్చిన ఓటీపీలు చెప్పమని అపరిచిత వ్యక్తి ఫోన్ చేశాడు. పలు దఫాలుగా వచ్చిన ఓటీపీలు చెప్పటంతో రోశిరెడ్డి బ్యాంకు ఖాతా నుంచి రూ.98 వేలు మాయమయ్యాయి. బాధితుడి ఫిర్యాదు మేరకు ఎస్ఐ సంతోష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

లైంగిక వేధింపులపై..

దమ్మపేట: వివాహితపై లైంగిక వేధింపులకు పాల్పడుతున్న వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేశారు. లచ్చాపురం గ్రామానికి చెందిన నార్లపాటి రామకృష్ణ గత నెల 27న అదే గ్రామానికి చెందిన వివాహిత ఇంట్లోకి ప్రవేశించి లైంగికంగా వేధించాడు. మహిళ కేకలు వేయడంతో పారిపోయాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ రవికుమార్ తెలిపారు.

ఇసుక లారీలను అడ్డుకున్న గ్రామస్తులు

అశ్వారావుపేటరూరల్: ఏపీలోని ఏలూరు జిల్లా వేలేరుపాడు వైపు నుంచి వస్తున్న ఇసుక లారీలను మంగళవారం సాయంత్రం అశ్వారావుపేట మండలం కొత్తూరు (గుమ్మడవల్లి) వద్ద గ్రామస్తులు అడ్డుకుని ఆందోళన చేశారు. గ్రామస్తులు మాట్లాడుతూ.. కొద్ది రోజులుగా ఇసుక లారీల రాకపోకలతో బీటీ రోడ్డు పూర్తిగా ధ్వంసమై, గుంతలు పడ్డాయని ఆరోపించారు. బీటీ రోడ్డును పునర్‌నిర్మించాలని కోరగా ఇసుక ర్యాంప్ బాధ్యులు గడువు కోరడంతో గ్రామస్తులు ఆందోళన విరమించారు.

బొగ్గు ఉత్పత్తి లక్ష్య సాధనలో ఈ మూడు నెలలే కీలకం

సింగరేణి సీఎండీ ఎన్.శ్రీధర్

గోదావరిఖని: వార్షిక ఉత్పత్తి లక్ష్యాల సాధనలో రానున్న మూడునెలలే కీలకమని సింగరేణి సంస్థ సీఎండీ ఎన్.శ్రీధర్ తెలిపారు. మంగళవారం అన్ని ఏరియాల జీఎంలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఉత్పత్తిపై సమీక్ష సమావేశం నిర్వహించా రు. ఈ ఆర్థిక సంవత్సరంలో నిర్దేశించుకున్న 75 మిలియన్ టన్నుల లక్ష్యాన్ని మూడు నెలల్లోనే చేరుకోవాల్సి ఉంటుందని, వర్షాకాలంలో ఓసీపీల్లో ఉత్పత్తి కుంటుపడకుండా ఇప్పటినుంచే చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. రోజుకు 2లక్షల టన్నులు తగ్గకుండా బొగ్గు ఉత్పత్తి సాధించేలా ప్రణాళికలు రూపొందించుకోవాలన్నారు. వర్షాలు కురిసినా ఓసీపీల్లో నీటినిల్వలు పెరగకుండా చూడాలని, ఇందుకు భారీ పంపులు సిద్ధం చేసుకోవాలని సూచించారు. రవాణాకు ఇబ్బంది లేకుండా హాల్ రోడ్లను పటిష్టం చేయాలన్నారు. వర్షాకాలంలో భూగర్భగనుల్లో బొగ్గు ఉత్పత్తికి ఆటంకం ఉండదని, ఎక్కువ ఉత్పత్తిపై కృషి చేయాలని తెలిపారు. అడ్రియాల లాంగ్‌వాల్ ప్రాజెక్టు నుంచి రోజుకు సగటున 7 వేల టన్నులు తగ్గకుండా ఉత్పత్తి చేయాలని సూచించారు. రానున్న వర్షాకాలంలో రోజుకు సగటున కనీసం 14.67 లక్షల క్యూబిక్ మీటర్ల ఓవర్ బర్డెన్ తీయాలన్నారు.

ఈ నెలలో ఏరియాలవారీగా లక్ష్యాలివే..

● కొత్తగూడెం ఏరియాలో రోజుకు 41 వేల టన్నులు ● మణుగూరులో 40 వేల టన్నులు ● ఆర్జీ–2లో 24 వేల టన్నులు ● శ్రీరాంపూర్ ఏరియాలో 19 వేల టన్నులు ● ఆర్జీ–3లో 14,500 టన్నులు ● బెల్లంపల్లి ఏరియాలో 14 వేల టన్నులు ● మందమర్రి నుంచి 12 వేల టన్నులు ● ఆర్జీ–1 నుంచి 11,500 టన్నులు ● భూపాలపల్లి నుంచి 10 వేల టన్నులు ● ఇల్లందు ఏరియా నుంచి 9వేల టన్నుల చొప్పున సాధించాలని లక్ష్యంగా నిర్దేశించారు.

రావమ్మా మహాలక్ష్మి..



ఏపీలో పెరుగుతున్న అమ్మాయిల సంఖ్య

- వెయ్యి మంది అబ్బాయిలకు 1,046 మంది అమ్మాయిల జననం
- దేశంలో కేరళ తర్వాత ఏపీలోనే అమ్మాయిలు అధికం
- కేంద్ర గణాంకాలు, కార్యక్రమాల అమలు మంత్రిత్వ శాఖ నివేదిక

సాక్షి ప్రతినిధి, అనంతపురం: రాష్ట్రంలో అమ్మాయిల సంఖ్య పెరుగుతోంది. రాష్ట్రంలో దశాబ్దాల తరబడి అబ్బాయిలే అధికంగా ఉంటున్నారు. కానీ.. 2021 తర్వాత అమ్మాయిల సంఖ్య గణనీయంగా పెరుగుతున్నట్టు కేంద్ర గణాంకాలు, కార్యక్రమాల అమలు మంత్రిత్వ శాఖ తాజా నివేదిక వెల్లడించింది. శ్రామిక శక్తికి (లేబర్ ఫోర్స్) సంబంధించి 2021– 22 నివేదిక లో ఈ విషయాలను వెల్లడించింది. గతంలో వెయ్యి మంది అబ్బాయిలకు 977 మంది అమ్మాయిలు మాత్రమే ఉండేవారు. ఇప్పుడా సంఖ్య 1,046కు పెరిగినట్టు నివేదికలో వెల్లడించింది.

ఆరోగ్య కార్యక్రమాల అమలు భేష్

రాష్ట్రంలో ఆరోగ్య కార్యక్రమాలు బాగా అమలు చేస్తుండటం వల్లే అమ్మాయిల సంఖ్య పెరుగుతున్నట్టు నివేదిక వెల్లడించింది. సాధారణంగా ఆరేళ్లు నిండకముందే బాలికల్లో ఆరోగ్య సమస్యలు తలెత్తి మృతి చెందేవారు. కానీ.. ఈ పరిస్థితులు తలెత్తకుండా అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులకు పౌష్టికాహారం అందించడం, క్రమం తప్పకుండా యాంటీనేటల్ చెకప్, వ్యాధి నిరోధక టీకాల అమలు అద్భుతంగా ఉండటం వంటి పరిస్థితుల వల్ల మంచి ఫలితాలు వస్తున్నా యి. రాష్ట్రవ్యాప్తంగా వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌ల స్థాయిలోనే ఆరోగ్య సేవలు అందిస్తున్నారు. ఇటీవల చేపట్టిన ఫ్యామిలీ ఫిజీషియన్ వ్యవస్థ కూడా సత్ఫలితాలు ఇస్తోంది. అమ్మాయిల సంఖ్య పెరగడానికి ఇవి కూడా కారణాలని నివేదిక వెల్లడించింది.

కేరళ తర్వాత ఏపీలోనే అధికం

దేశంలో అమ్మాయిలు ఎక్కువగా నమోదవుతున్న రాష్ట్రాల్లో కేరళ మొదటి స్థానంలో ఉండగా.. రెండో స్థానంలో ఆంధ్రప్రదేశ్ ఉండటం గమనార్హం. కేరళలో ప్రతి వెయ్యి మంది అబ్బాయిలకు 1,114 మంది అమ్మాయిలు నమోదవుతుండగా.. ఆంధ్రప్రదేశ్‌లో 1,046 మంది నమోదయ్యారు. అత్యల్పంగా హర్యానాలో 887 మంది అమ్మాయిలు మాత్రమే నమోదయ్యారు. ఏపీలో పట్టణ ప్రాంతాల్లో వెయ్యి మందికి 1,063 మంది, గ్రామీణ ప్రాంతాల్లో వెయ్యి మందికి 1,038 మంది అమ్మాయిలు ఉన్నట్టు నివేదికలో వెల్లడైంది. 98 శాతం ప్రసవాలు ఆస్పత్రుల్లోనే జరుగుతుండటం వల్ల మెరుగైన ఫలితాలు వస్తున్నాయని వివరించారు. ఇండియాలో సగటున ప్రతి వెయ్యి మంది అబ్బాయిలకు 968 మంది అమ్మాయిలు నమోదయ్యారు.



వివిధ రాష్ట్రాల్లో వెయ్యి మంది అబ్బాయిలకు అమ్మాయిల సంఖ్య ఇలా..

రాష్ట్రం	కేరళ	ఆంధ్రప్రదేశ్	హిమాచల్‌ప్రదేశ్	తమిళనాడు	ఛత్తీస్‌గఢ్	జార్ఖండ్	కర్ణాటక	ఒడిశా	ఉత్తరప్రదేశ్	తెలంగాణ
అమ్మాయిలు	1,114	1,046	1,031	1,026	1,016	1,001	991	988	971	955

ఏపీ బీజేపీ అధ్యక్షురాలిగా దగ్గుబాటి పురందేశ్వరి

జాతీయ కార్యవర్గ సభ్యుడిగా మాజీ సీఎం కిరణ్‌కుమార్‌రెడ్డి



సాక్షి, న్యూఢిల్లీ/సాక్షి, అమరావతి/ కారంచేడు : బీజేపీ ఏపీ అధ్యక్షురాలిగా మాజీ ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు కుమార్తె దగ్గుబాటి పురందేశ్వరి నియమితులయ్యారు. సంస్థాగతంగా పలు రాష్ట్రాల్లో చేసిన మార్పుల్లో భాగంగా జాతీయ ప్రధాన కార్యదర్శిగా ఉన్న పురందేశ్వరిని పార్టీ రాష్ట్ర శాఖ అధ్యక్షురాలిగా బీజేపీ నియమించింది. ఇప్పటివరకు పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిగా ఉన్న సోము వీర్రాజుకు జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా స్వయంగా ఫోన్ చేసి బాధ్యతల నుంచి తొలగిస్తున్నట్లు సమాచారం ఇచ్చారు. ఇటీవల కాంగ్రెస్‌కు రాజీనామా చేసి బీజేపీలో చేరిన ఉమ్మడి ఏపీ మాజీ సీఎం కిరణ్‌కుమార్‌రెడ్డిని జాతీయ కార్యవర్గ సభ్యుడిగా నియమించారు. ఈ ఉత్తర్వులు తక్షణమే అమల్లోకి పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి అరుణ్‌సింగ్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. బీజేపీ టీడీపీకి దగ్గరవుతుందన్న ఊహాగానాల నేపథ్యంలో పురందేశ్వరి నియామకం రాజకీయవర్గాల్లో చర్చకు దారి తీసింది. మార్చి 2004లో పురందేశ్వరి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రోద్బలంతో కాంగ్రెస్ పార్టీలో చేరారు. అదే సంవత్సరం కాంగ్రెస్ నుంచి బాపట్ల ఎంపీగా పోటీ చేసి సినీ నిర్మాత దగ్గుబాటి రామానాయుడుపై గెలుపొందారు. 2006లో కేంద్ర సహాయ మంత్రిగా పనిచేశారు. 2009లో కాంగ్రెస్ పార్టీ నుంచే విశాఖపట్నం లోక్‌సభ నియోజకవర్గంలో పోటీ చేసి విజయం సాధించారు. యూపీఏ ప్రభుత్వంలో కేంద్ర సహాయ మంత్రిగా 2013 వరకు పనిచేశారు. రాష్ట్ర విభజన అనంతరం 2014 ఎన్నికలకు ముందు బీజేపీలో చేరి రాజంపేటలో పోటీ చేసి ఓడిపోయారు. ఆరున్నరేళ్ల నిరీక్షణ తర్వాత 2020 సెప్టెంబర్ 26న పురందేశ్వరిని పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శిగా బీజేపీ అధిష్టానం నియమించింది. 2020 నవంబర్‌లో ఒడిశా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జిగా ఆమెకు బాధ్యతలు అప్పగించింది. ఏపీలో పార్టీ బలోపేతానికి కీలకంగా వ్యవహరిస్తారని, ఎన్టీఆర్ ఛరిష్మాతో టీడీపీ నాయకులను బీజేపీలో చేర్పించడంలో ముందుంటారని అధిష్టానం భావించింది. కానీ రాష్ట్ర వ్యవహారల్లో అధిష్టానం అంచనాలను పురందేశ్వరి అందుకోలేకపోయారన్న విమర్శలు పార్టీలో ఉన్నాయి. దీంతో ఆమెకు ఒడిశా బాధ్యతల్లో కోత విధించింది. 2022 సెప్టెంబర్ 9న ఛత్తీస్‌ఘడ్ పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జి బాధ్యతల నుంచి కూడా పురందేశ్వరిని తప్పించింది. అప్పటి నుంచి ఆమె కేవలం జాతీయ ప్రధాన కార్యదర్శి హోదాలోనే ఉన్నారు. ఏపీలో తాజా రాజకీయ పరిణామాల నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలిగా అవకాశం ఇచ్చారు. ఎన్నికలు సమీపిస్తున్న సమయంలో సోము వీర్రాజుపై వచ్చిన ఫిర్యాదులు, ఎన్టీఆర్ ఛరిష్మాను తమకు అనుకూలంగా మార్చుకోగలమనే భావనతో బీజేపీ అధిష్టానం ఈ నిర్ణయం తీసుకుందని పార్టీ వర్గాలు అంటున్నాయి.

మాజీ ఎంపీ మాగుంట హత్య కేసులో... దోషికి బెయిల్

- నెలపాటు విడుదలకు హైకోర్టు ఆదేశం.. ఆ తర్వాత లొంగిపోవాలని స్పష్టీకరణ
- 2 దశాబ్దాలకుపైగా కారాగారంలోనే మాజీ నక్సలైట్ పీబీవీ గణేశ్

సాక్షి, హైదరాబాద్: మాజీ ఎంపీ మాగుంట సుబ్బరామిరెడ్డి హత్య కేసులో దోషి, మాజీ నక్సలైట్ పీబీవీ గణేశ్‌ను నెలపాటు మధ్యంతర బెయిల్‌పై విడుదల చేయాలని జైలు అధికారులను హైకోర్టు ఆదేశించింది. అలాగే ఆగస్టు 4న జైలు సూపరింటిండెంట్ ముందు లొంగిపోవాలని ఆయనకు స్పష్టం చేసింది. 1995లో జరిగిన ఎంపీ మాగుంట సుబ్బరామిరెడ్డి హత్య కేసులో పీబీవీ గణేశ్‌ను 2000 సంవత్సరంలో కోర్టు దోషిగా తేల్చి యావజ్జీవ కారాగార శిక్ష విధించింది. దీనిపై ఆయన అప్పీల్‌కు వెళ్లినా ఉపశమనం కలగలేదు. దీంతో రెండు దశాబ్దాలకుపైగా జైల్లో ఉంటున్న గణేశ్‌ను సత్ప్రవర్తనగల ఖైదీగా పరిగణించి విడుదల చేయాలని 2016లో రాష్ట్ర ప్రభుత్వం భావించింది. అయితే ఈ కేసులో సీబీఐ ఇంకొందరిపై దర్యాప్తు కొనసాగిస్తోందంటూ ఈ ప్రతిపాదనను తిరస్కరించింది. ఈ నిర్ణయాన్ని సవాల్ చేస్తూ గణేశ్ భార్య జోషి మాధవి 2019లో హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై విచారణ జరిపిన సింగిల్ జడ్జి.. సత్ప్రవర్తన నిబంధనలన్నీ గణేశ్‌కు వర్తిస్తే ఆయన్ను వారంలో విడుదల చేయాలని 2022 సెప్టెంబర్‌లో ఆదేశించారు. కానీ నెలలు గడిచినా కేంద్రం ఏ నిర్ణయం తీసుకోకపోవడంతో ఏప్రిల్‌లో మాధవి అప్పీల్ దాఖలు చేశారు. అలాగే తన భర్తకు బెయిల్ ఇవ్వాలని మధ్యంతర అప్లికేషన్ వేశారు. దీనిపై జస్టిస్ కె.లక్ష్మణ్, జస్టిస్ పి.శ్రీసుధ ధర్మాసనం మంగళవారం విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా కేంద్రం తరఫున డిప్యూటీ సొలిసిటర్ జనరల్ వాదిస్తూ సీబీఐ పరిధిలోని కేసు కనుక గణేశ్ విడుదలపై కేంద్రం నిర్ణయం తీసుకోవాల్సి ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తరఫున జీపీ సామల రవీందర్ వాదనలు వినిపిస్తూ సీబీఐ విచారణ జరిపిన కేసు అయినా సరే.. ఒకసారి శిక్ష పడిన తర్వాత దోషి విడుదల రాష్ట్ర సర్కార్‌కు సంబంధించిన అంశం అవుతుందన్నారు. చట్టప్రకారం అన్నీ సరిగ్గా ఉన్నప్పుడు ఈ ప్రతిపాదనను తిరస్కరించే అధికారం కేంద్రానికి లేదన్నారు. వాదనలు విన్న న్యాయమూర్తి దోషిని నెల రోజుల కోసం బెయిల్‌పై విడుదల చేయాలని ఆదేశించారు.

వెన్నుపోటు వీరుడు.. ప్యాకేజీ శూరుడు!

‘‘ఇవాళ వీళ్ల పరిస్థితి ఏమిటంటే.. చక్రాలు లేని సైకిల్ ఎక్కలేనాయన ఓ నాయకుడు! ఎవరైనా తైలం పోస్తే కానీ గ్లాసు నిండని వ్యక్తి మరో నాయకుడు! ఒకరు వెన్నుపోటు వీరుడు, మరొకరు ప్యాకేజీ శూరుడు! వీరిద్దరికీ పేదల బతుకుల గురించి, ప్రజల కష్టాల గురించి, మాటిస్తే ఆ మాట మీద నిలబడాల్సిన అవసరం గురించి, ఒక మాటకున్న విలువ గురించిగానీ ఏమాత్రం తెలియదు. అలా బతకాలన్న ఆలోచనా లేదు. ఇద్దరూ కలసి ప్రజల్ని మోసం చేస్తూ 2014–19 మధ్య రాష్ట్రాన్ని ఏలారు. ఇద్దరూ కలసి రైతులు, అక్కచెల్లెమ్మలు, అవ్వాతాతలు, చిన్న పిల్లలు, సామాజిక వర్గాలకు వెన్నుపోటు పొడిచారు’’

ఓ నీతిమాలిన నాయకుడి కథ..

‘‘ఇవాళ మనం తెరిపిస్తున్న చిత్తూరు డెయిరీ కథ ఎలాంటిదంటే.. అప్పట్లో ముఖ్యమంత్రిగా ఉన్న ఓ మనిషి తాను స్థాపించిన డెయిరీ కోసం, సొంత లాభం కోసం, సొంత జిల్లా రైతునైనా, పిల్లనిచ్చిన మామనైనా బలి పెట్టేస్తాడని చెప్పే మనిషి కథ ఇది! ఓ నీతిమాలిన రాజకీయ నాయకుడి కథ ఇదీ! ఒక గొప్ప మెడికల్ కాలేజీ మన చిత్తూరుకు వస్తుంటే అడ్డుకున్నది సాక్షాత్తూ ఈ చంద్రబాబునాయుడు, గజదొంగల ముఠా సభ్యుడైన ఈనాడు రామోజీరావు వియ్యంకుడే. స్థలాలివ్వకుండా ఈ గడ్డకు మంచి మెడికల్ కాలేజీ రాకుండా అడ్డుకున్న చరిత్ర వారిదే. వేలూరు మెడికల్ కాలేజీకి జరిగిన అన్యాయాలను పూర్తిగా సరిదిద్దుతూ ఈరోజు అడుగులు ముందుకు వేస్తున్నా’’

– చిత్తూరు బహిరంగ సభలో సీఎం జగన్

‘చిత్తూరు’కు క్షీరాభిషేకం!

- దశాబ్దాల చరిత్ర కలిగిన అతిపెద్ద డెయిరీకి ప్రాణ ప్రతిష్ట
- చిత్తూరు డెయిరీ పునరుద్ధరణ పనులకు ఏపీ సీఎం జగన్ శ్రీకారం



చిత్తూరు డెయిరీ పునరుద్ధరణ శిలాఫలకం వద్ద సీఎం వైఎస్ జగన్

సాక్షి, తిరుపతి: గత పాలకుల స్వార్థంతో రెండు దశాబ్దాలుగా మూతబడ్డ చిత్తూరు డెయిరీకి జీవం పోస్తూ అమూల్ సంస్థ రూ.385 కోట్ల పెట్టుబడితో చేపట్టనున్న పునరుద్ధరణ పనులకు ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మంగళవారం చిత్తూరులో భూమి పూజ చేశారు. అనంతరం చిత్తూరు సమీపంలోని చీలాపల్లి సీఎంసీ మెడికల్ కళాశాల, 300 పడకల ఆస్పత్రి నిర్మాణానికి భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా చిత్తూరు పోలీసు పరేడ్ మైదానంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ముఖ్యమంత్రి ప్రజలనుద్దేశించి ప్రసంగించారు.

రూ.150 కోట్లతో తొలిదశ పనులు

ఇలాంటి మంచి కార్యక్రమంలో భాగంగా రూ.150 కోట్లతో చిత్తూరు డెయిరీ తొలిదశ పనులు మొదలవుతున్నాయి. దాదాపు లక్ష లీటర్లతో మరో 10 నెలల వ్యవధిలో పాల ప్రాసెసింగ్ మొదలవుతుంది. రానున్న రోజుల్లో ఇక్కడే దశలవారీగా బటర్, పాలపొడి, యూహెచ్‌టీ పాల విభాగం, ఛీజ్, పనీర్, యోగర్ట్, స్వీట్ తయారవుతాయి. ఐదు నుంచి ఏడెనిమిదేళ్లలో 10 లక్షల లీటర్లు ప్రాసెస్ చేసే స్థాయికి డెయిరీ చేరుకుంటుంది. దీనిద్వారా 5 వేల మందికి ప్రత్యక్షంగా ఇక్కడే ఉద్యోగాలు లభిస్తాయి. మరో 2 లక్షల మందికి అమూల్ రాకతో అవుట్‌లెట్స్, డిస్ట్రిబ్యూషన్ చానెళ్ల ద్వారా పరోక్షంగా ఉపాధి దొరుకుతుంది. చిత్తూరు జిల్లానే కాకుండా రాయలసీమకు చెందిన పాడి రైతన్నలు, అక్కచెల్లెమ్మలకు మంచి పాల సేకరణ ధర లభిస్తుంది.

జిల్లా వార్తలు


నేటి నుంచి రెండు రాష్ట్రాల పురోహితుల క్రికెట్ టోర్నీ



టోర్నీ వివరాలు వెల్లడిస్తున్న నిర్వాహకులు

ఖమ్మంస్పోర్ట్స్: ఖమ్మంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో బుధవారం నుంచి తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల స్థాయి పురోహితుల క్రికెట్ టోర్నీ జరగనుంది. వివరాలను నిర్వాహకులు అవధానుల సాయినాథ్‌శర్మ, నందుల సంతోష్‌శర్మ, రంగావజ్జుల దిలీప్‌శర్మ, శేషభట్టార్, ప్రశాంతులచార్యులు, యడవల్ల అనిరుధ్‌శర్మ మంగళవారం వెల్లడించారు. స్తంభాద్రి పురోహితుల సంఘం ఆధ్వర్యాన ఈనెల 10 వరకు జరిగే పోటీల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేశామని తెలిపారు. రెండు రాష్ట్రాల నుంచి 16 జట్లు టోర్నీకి హాజరు కానుండగా, నాకౌట్ పద్ధతిలో పోటీలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. మ్యాచ్‌ల నిర్వహణకు జిల్లాలోని సీనియర్ క్రికెటర్లు, అంపైర్లు సహకారం అందిస్తున్నారని వారు తెలిపారు.

ప్రభుత్వ ఉపాధ్యాయుడికి డాక్టరేట్



మధుసూదన్‌రావు


దుమ్ముగూడెం: దుమ్ముగూడెం మండలంలోని నర్సాపురం జిల్లా పరిషత్ పాఠశాల హిందీ ఉపాధ్యాయుడు నాంపల్లి మధుసూదన్‌రావుకు ఉస్మానియా విశ్వవిద్యాలయం డాక్టరేట్ ప్రకటించింది. ఆయన హైదరాబాద్‌లోని వివేకవర్ధిని కాలేజ్ రిటైర్డ్ ప్రిన్సిపాల్ డాక్టర్ రేఖాశర్మ పర్యవేక్షణలో ‘అంతిమ్ దో దశక్ కే హిందీ కహానియో మే సమాజ్ వాదీ యదార్థవాద్’ అంశంపై సమర్పించిన పరిశోధనాత్మక గ్రంథానికి డాక్టరేట్ అందజేశారు. ఈ సందర్భంగా మధుసూదన్‌రావును ఓయూ హిందీ విభాగాధిపతి డాక్టర్ మాయాదేవి, బీఓఎస్ చైర్‌పర్సన్ డాక్టర్ సంగీత, దుమ్ముగూడెం ఎంఈఓ సున్నం సమ్మయ్య, హెచ్‌ఎం కె.విజయకాంతారావు, ఉపాధ్యాయులు అభినందించారు.

ఆర్చరీలో ఉచిత శిక్షణ

కొత్తగూడెంటౌన్: ఆర్చరీ (విలువిద్య)లో బాలబాలికలు, యువతీయువకులకు ఉచిత శిక్షణ ఇచ్చేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు భద్రాద్రి కొత్తగూడెం డీవైఎస్‌ఓ టి.సీతారాం తెలిపారు. రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ (సాట్స్), కలెక్టర్ సహకారంతో జిల్లాకు ఖేలో ఇండియా సెంటర్ ఆఫ్ ఆర్చరీ (విలువిద్య)లో శిక్షణ కేంద్రం మంజూరైందని పేర్కొన్నారు. ఈ కేంద్రాన్ని పాల్వంచలో ఏర్పాటు చేయాలని నిర్ణయించామని, అన్ని వయస్సుల వారు శిక్షణ కోసం ఈ నెల 17లోపు నేరుగా తమ కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలని సూచించారు.

త్రైమాసికంలో ఉత్పత్తి ఓకే..

- సింగరేణివ్యాప్తంగా మూడు నెలల్లో 102 శాతం బొగ్గు ఉత్పత్తి
- అగ్రస్థానంలో నిలిచిన కొత్తగూడెం రీజియన్
- జూన్‌లో ఏడు ఏరియాల్లో వంద శాతానికి పైగా..



కొత్తగూడెం ఏరియాలోని జేవీఆర్ ఓసీ ముఖచిత్రం

సింగరేణి(కొత్తగూడెం): ప్రస్తుత ఆర్థిక సంవత్సరం సింగరేణి సంస్థ నిర్దేశించుకున్న బొగ్గు ఉత్పత్తి లక్ష్యం ఏప్రిల్‌లో వెనుకబడినా మే, జూన్‌లలో పుంజుకుంది. ఫలితంగా తొలి త్రైమాసికంలో 102 శాతం ఉత్పత్తి నమోదైంది. ఇక జూన్‌లో 106 శాతం ఉత్పత్తి సాధించింది. తొలి త్రైమాసికంలో కొత్తగూడెం రీజియన్‌లోని మణుగూరు ఏరియా 122, ఇల్లెందు ఏరియా 129, కొత్తగూడెం ఏరియా 115 ఉత్పత్తి సాధించగా.. కొంతకాలంగా వెనుకంజలో ఉన్న బెల్లంపల్లి ఏరియా జూన్‌లో 128 శాతంతో అగ్రస్థానంలో నిలిచింది. అలాగే, త్రైమాసిక ఉత్పత్తిలోనూ 116 శాతంతో సింగరేణి వ్యాప్తంగా మూడో స్థానంలో నిలవడం విశేషం.

జూన్‌లో ఏడు ఏరియాల్లో..

ఆర్థిక సంవత్సరం మొదటి నుంచే లక్ష్య సాధనపై సీఎండీ సహా డైరెక్టర్లు, అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. అయినప్పటికీ కొన్ని ఏరియాల్లోనే 100 శాతం ఉత్పత్తి నమోదవుతోంది. జూన్‌లో పరిశీలిస్తే బెల్లంపల్లి ఏరియా 128 శాతంతో సింగరేణివ్యాప్తంగా అగ్రస్థానంలో నిలవగా, కొత్తగూడెం ఏరియాలో 119, మణుగూరు ఏరియా 118 శాతం ఉత్పత్తి నమోదు చేసింది. అలాగే, ఆర్జీ–3 ఏరియా 117 శాతం, ఇల్లెందు ఏరియా 114 శాతం, ఆర్జీ–1 ఏరియా 107 శాతం, శ్రీరాంపూర్ ఏరియా 105 శాతం సాధించగా, మందమర్రి, ఆర్జీ–2, అడ్రియాల, భూపాలపల్లి ఏరియాలు మాత్రం వెనుకబడ్డాయి.

రోజువారీ..

నెల వారీ లక్ష్యాలు ఇలా..

సింగరేణివ్యాప్తంగా ఉన్న 24 భూగర్భగనుల్లో రోజుకు 26,477 వేల టన్నుల బొగ్గు ఉత్పత్తికి గాను 17,848 వేల టన్నుల ఉత్పత్తి (67 శాతం) సాధించాయి. ఇక 18 ఓసీల్లో రోజుకు 1,79,753 టన్నుల ఉత్పత్తికి గాను 1,73,647 టన్నుల ఉత్పత్తి (97 శాతం) నమోదైంది. అయితే, జూన్‌లో భూగర్భ గనుల్లో 71 శాతం, ఓసీల్లో 106 శాతం ఉత్పత్తి సాధించారు. ఈ నెలలో భూగర్భ గనులకు సంబంధించి ఆర్జీ–2 ఏరియా 1,10,832 టన్నుల ఉత్పత్తితో అగ్రస్థానంలో నిలవగా.. ఓసీల్లో ఇల్లెందు ఏరియా 129 శాతంతో మొదటి స్థానం దక్కించుకుంది. అయితే, భూగర్భ గనులు, ఓసీల్లో కలిపితే మణుగూరు ఏరియాలో 35,62,434 టన్నుల ఉత్పత్తి నమోదైంది.

గడచిన త్రైమాసికంలో ఏరియాల వారీగా ఉత్పత్తి వివరాలు (టన్నుల్లో)

ఏరియా	నిర్దేశిత లక్ష్యం	ఉత్పత్తి	శాతం
ఇల్లెందు	7,35,000	9,51,453	129
మణుగూరు	29,46,596	35,85,076	122
బెల్లంపల్లి	8,40,000	9,73,597	116
కొత్తగూడెం	29,77,481	34,24,468	115
ఆర్జీ–3	12,45,769	12,55,267	101
ఆర్జీ–2	22,55,361	22,08,064	98
ఆర్జీ–1	10,84,977	10,34,576	95
మందమర్రి	11,00,731	9,89,908	90
శ్రీరాంపూర్	17,31,366	14,55,181	84
భూపాలపల్లి	11,03,039	8,02,555	73
అడ్రియాల	4,28,796	2,19,619	51
మొత్తం	1,65,45,270	1,68,99,754	102

అంతటా వంద శాతం ఉత్పత్తికి కృషి



సింగరేణివ్యాప్తంగా చూస్తే 100 శాతం ఉత్పత్తి నమోదవుతున్నా కొన్ని ఏరియాలు వెనుకబడుతున్నాయి. ఆయా ఏరియాల్లో వంద శాతం ఉత్పత్తి సాధించేలా కృషి చేయాలి. ఈ విషయంలో సమస్యలు ఉంటే మా దృష్టికి తీసుకొస్తే పరిష్కరిస్తాం. అంతే తప్ప ఉత్పత్తిలో వెనుకబడితే సహించేది లేదు.

–ఎన్.బలరామ్, సింగరేణి డైరెక్టర్ (పా)

అరుదైన సమస్య.. ఆదుకుంటేనే చికిత్స

- చిన్నారికి ఉచిత శస్త్రచికిత్స చేస్తామన్న నిలోఫర్ వైద్యులు
- ఇతర ఖర్చులకు నగదు లేక తల్లిదండ్రుల దైన్యం



ఖమ్మంరూరల్: ఆ చిన్నారికి పుట్టుకతోనే అరుదైన సమస్య వచ్చింది. శస్త్రచికిత్స చేయాలంటే రూ.లక్షల్లో ఖర్చువుతుందని ప్రైవేట్ ఆస్పత్రుల వైద్యులు తేల్చారు. చివరకు హైదరాబాద్‌లోని నిలోఫర్ ఆస్పత్రిలో సంప్రదించగా.. ఉచితంగా శస్త్రచికిత్సకు ముందుకొచ్చారు. కానీ నెలల తరబడి హైదరాబాద్‌లో ఉండాల్సి రావడం, మందులతో పాటు ప్రయాణ ఖర్చులకు కూడా డబ్బు లేక ఆ చిన్నారి తల్లిదండ్రులు ఆవేదన చెందుతున్నారు. దాతలు చేయూతనిస్తే బాబు ఆరోగ్యంగా తమ చెంతకు చేరుతాడని చెబుతున్నారు.

ఏమిటీ సమస్య..

ఖమ్మంరూరల్ మండలం పెద్దతండాకు చెందిన నాగకృష్ణ – ఉమ దంపతులకు ఏడాదిన్నర కుమారుడు సమ్యుయెల్‌కింగ్ ఉన్నాడు. బాబుకు పుట్టుకతోనే హైపోస్పెడియా అనే సమస్య వచ్చింది. ఈ సమస్యలో భాగంగా బాబు అంగానికి రంధ్రం పూడిపోయి కింద తోలు వద్ద సన్నటి మరో రంధ్రం వచ్చింది. దీంతో మూత్రం సరిగా పోయలేకపోగా, తరచూ జ్వరంతో బాధపడుతుంటాడు. తల్లిదండ్రులు ఖమ్మంలోని పలు ప్రైవేట్ ఆస్పత్రులకు తీసుకెళ్లగా.. ఆపరేషన్ చేయాల్సి ఉంటుందని అందుకు రూ.లక్షల్లో ఖర్చవుతుందని తేల్చిచెప్పారు. కానీ రూ.వేలల్లోనే భరించలేని స్థితిలో ఉన్న ఆ కుటుంబ సభ్యులు.. ఓ మిత్రుడి సూచన మేరకు హైదరాబాద్‌లోని నిలోఫర్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ పరీక్షించిన వైద్యులు ఉచితంగా ఆపరేషన్ చేస్తామన్నారు. అయితే బాబుకు తగిన మొత్తంలో రక్తం లేకపోవడంతో ఒకటి, రెండు నెలల సమయం తీసుకోవాల్సి ఉంటుందని, అప్పటి వరకు క్రమపద్ధతిలో చికిత్స తీసుకోవాలని సూచించారు. కాగా, హైదరాబాద్‌కు నిత్యం ప్రయాణాలు, ఆపరేషన్ సమయంలో అక్కడ ఉండాల్సి రావడం, ఇతర ఆస్పత్రి ఖర్చులకు కూడా చిల్లిగవ్వ లేకపోవడంతో నాగకృష్ణ కుటుంబం ఆవేదన వ్యక్తం చేస్తోంది.



కుమారుడితో నాగకృష్ణ - ఉమ దంపతులు

సాయం అందించాలని వేడుకుంటున్నాం..

నేను ఓ ప్రైవేట్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీలో హెల్పర్‌గా పనిచేస్తున్నాను. నెలకు రూ.10 వేల జీతం వస్తుంది. అవి ఇంటి రెంటు, ఇంటి అవసరాలకే సరిపోని పరిస్థితి. కాస్తో కూస్తో దాచుకున్న మొత్తం ఇప్పటి వరకు బాబుకు ఆస్పత్రుల్లో పరీక్ష చేయించడానికే సరిపోయింది. ఇప్పుడు ఆపరేషన్ ఉచితంగా చేస్తామని వైద్యులు భరోసా ఇచ్చినా ఇతర ఖర్చులకు చిల్లిగవ్వ కూడా లేదు. దాతలు మాకు చేయూతనివ్వాలని కోరుతున్నాం.

– నాగకృష్ణ, బాబు తండ్రి

సాయం చేయాలనుకునే వారు...

98856 03823 (ఫోన్‌పే, గూగుల్ పే)
అకౌంట్ నంబర్ 31961112804,
ఎస్‌బీఐ మెయిన్ బ్రాంచ్, ఖమ్మం,
ఐఎఫ్‌ఎస్‌సీ – ఎస్‌బీఐఎన్0005817

శాంతిభద్రతలు, పరిపాలనపై పోలీసు అధికారుల భేటీ



ఎస్పీలు వినీత్, శరత్‌తో చర్చిస్తున్న సీపీ వారియర్

ఖమ్మంక్రైం: శాంతిభద్రతల పరిరక్షణ, శాఖాపరమైన పరిపాలన అంశాలపై మూడు జిల్లాల పోలీసు అధికారులు భేటీ అయ్యారు. సరిహద్దు పంచుకుంటున్న ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్ జిల్లాల అధికారులు మంగళవారం ఖమ్మంలో సమావేశమై పలు అంశాలపై చర్చించారు. ఖమ్మం పోలీస్ కమిషనర్ విష్ణు ఎస్.వారియర్, భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్ ఎస్పీలు డాక్టర్ వినీత్, శరత్ చంద్రపవార్‌తో పాటు జిల్లాల అధికారులు కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా పరిపాలన, నేరాల నియంత్రణలో సంయుక్తంగా చేపట్టాల్సిన చర్యలపై చర్చించారు. ఏసీపీ ప్రసన్నకుమార్, పలువురు ఉద్యోగులు హాజరయ్యారు.

పెండింగ్ బిల్లులు విడుదల చేయాలి



మాట్లాడుతున్న నాగిరెడ్డి

ఖమ్మంసహకారనగర్: ఈ–కుబేర్‌లో పెండింగ్‌లో ఉన్న ఉపాధ్యాయుల బిల్లులను వెంటనే విడుదల చేయాలని టీపీటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.నాగిరెడ్డి డిమాండ్ చేశారు. ఖమ్మంలోని సంఘం కార్యాలయంలో మంగళవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు పొదుపు చేసుకున్న జీపీఎఫ్, డీఏ, పీఆర్సీ ఎరియర్స్, ఫైనల్ పేమెంట్లు, మెడికల్ రీయింబర్స్‌మెంట్ నిధులను తక్షణమే సంబంధిత ఖాతాల్లో జమ చేయాలన్నారు. అలాగే, ఐదేళ్లుగా ఎదురుచూస్తున్న పదోన్నతులు, బదిలీల ప్రక్రియ వెంటనే చేపట్టాలని డిమాండ్ చేశారు. సమావేశంలో వి.మనోహర్‌రాజు, ఎస్.విజయ్, ప్రసాద్‌రావు, వై.పద్మ, కె.వెంకటేశ్వర్లు, వెంగళరావు పాల్గొన్నారు.